# దర్శనా ద్వైతము

శంకర భగవత్పాదులు, వారే ఆది శంకరులు, మతవిలువలు పడిపోయినప్పుడు పుట్టి, అద్వైత స్థాపన చేసిన మహనీయులు. ఆనాడు మతాలు నిస్సారమై, అర్థంలేనివై, అజ్ఞానుల, మూర్ఖులచే నడుపబడుతున్నాయి. ధనార్జన, అధికారం డాంభీకమైన అలవాట్లు వీలైతే వంచన, దోపిడీ చోటుచేసుకుని నడుస్తున్నాయి. కర్మకాండలు, ఆచారాలు, రీతి రివాజులు, పైపై మెరుగులతో కలిసి సత్యాన్ని గుర్తించలేని స్థితిలో వున్నాయి. ఆది శంకరులు, వాదనలో పాల్గొని తర్కం వుపయోగించి, తక్కిన మతాచార్యులను ఓడించి, దిగ్విజయం పొంది చివరికి దర్శనా ద్వైతమును నిరూపించారు. ఆనాడు అనగా యెనిమిదవ శతాబ్దిలో వ్యాప్తిలో వుండి, ప్రజాదరణా, రాజాదరణ పొందుతున్నవి ఆరు మతాలు. అవి బౌద్ధము, జైనము, కాపాలికము, శాక్తేయము, శైవము, గాణాపత్యము. వీటిల్లో మళ్లా చీలికలేర్పడ్డాయి. బౌద్ధములో హీనాయానము, మహాయానము. మాంత్రిక్, తాంత్రిక్ అనేవి వచ్చాయి. శైవము, వీరశైవము, వైష్ణవము, వీరవైష్ణవము. అలా. నేడు వ్యాప్తిలోనున్న మతాలలోనూ చీలికలున్నాయి. ఉదాహరణకు యిస్లామ్‌లో, సూఫీ సాంప్రదాయం, షియాలు, సున్నీలు, సిఖ్‌లో నిరంకారీ. క్రైస్తవంలో కాథలిక్కులు, రోమన్ కాథలిక్కులు, ప్రొటెస్టెంట్సు, ప్రిస్బటేరియన్ పెంటికోస్ట్. శంకరభగవత్పాదులు, మతముల సారము తెలిసే ''సర్వం ఖల్విదంబ్రహ్మ'' అన్నారు. అంతా భగవత్ స్వరూపమే. తద్భిన్నమైనది లేదు. సామాజికంగా, సాంఘికంగా ఆచారము భేషజం కోసం వేషాలు వేసీ ఆయాసపడక్కర్లేదు. వ్యక్తిగతంగా దైవాన్ని గుర్తించవచ్చు. సత్యం తెలుసుకోవచ్చు. జ్ఞానార్జన చేయాలి. మానవులను పరిశీలన చేయాలి. సృష్టిని చూసి ఆనందించగల స్తోమత రావాలి. **జపతపాదుల వల్ల కఠిన కర్మల వల్ల యేమీ తెలుసుకోలేరు. అనేదే అద్వైత బోధ. అద్వైతం జ్ఞాన సంబంధమైనదీ, తర్కమువల్ల తెలిసేదీ** గనక పామరులలోకి చొచ్చుకు పోలేకపోయింది. ముఖ్యమైన మతాలు క్షీణదశకు వచ్చాయి. ఆసక్తి సన్నగిల్లింది జనులకు. శంకరులు అజ్ఞానం తుడిచి వేయాలని హింసనూ, పీడించే పద్ధతులనూ మాన్పించి, సుఖ జీవనం నేర్పాలనే దీక్ష బూని

వాదనలు చూస్తూ అజ్ఞానాన్ని, కౄరత్వాన్ని, స్వార్థాన్నీ మోసాన్నీ ఖండిస్తూ జయిస్తూ వెళ్లారు. ఆయనతో వాదించే మేధస్సులేక చాలామంది ఆయన్ని అనుసరించారు.

కొందరు ప్రచ్ఛన్న బౌద్ధుడు అన్నారు. ఇటువంటి ఆలోచనా, వాదించి గెలవాలనే తలపూ వ్యాస భగవానుని కాలంలోనే తలెత్తాయి. వ్యాస మహర్షి శిష్యులు, పైల, కపిల, వైశంపాయన, జైమిని వారి సాయంతోనే మహర్షి కలగాపులగంగా వున్న వేదములను విభజించి వేదములు నాలుగు అని నిర్ణయించారు. వేదవ్యాస అని పిలువబడ్డారు మహర్షి. ఋక్, యజు, సామ, అధర్వణ. మొదట్లో అన్నీ కలిసి వున్నప్పుడు వాటిని ఋక్కులు అనేవారు. తక్కిన శిష్యులు గురువుననుసరిస్తూ, శ్రద్ధగా వింటూ, గ్రహిస్తూ చెప్పినట్లు చేసేవారు, సందేహాలు తీర్చుకునేవారు.

జైమిని మాత్రం, కుశ్శంకలేస్తూ, తిరగబడుతూ పండితులు మూడురకాలని ఋజువు చేస్తూవుంటే, వ్యాసమహర్షి వినోదిస్తూ వుండేవారు. అహం పండితః అంటే నాకూ తెలుసునే అనుకోటం. మరికొంత చదివి, అహమేవ పండితః అంటే నాకే తెలుసంతా అన్నీ విడమర్చి చెప్పగలను అనుకోటం. మూడవది అహం న పండితః అంటే నాకేమీ తెలియదు. నేర్వాల్సింది చాలా వున్నది అనుకోటం. రెండవ కోవలో వున్నాడు జైమిని. గురువుతో తర్కించాడు. పూర్వమీమాంస ఉత్తర మీమాంస అనేవి అందుకున్నాడు.

కర్మలు జీవులు పుట్టాకా చచ్చాకా గూడా చేయాలి. కర్మకాండల వల్ల జపతపాదుల వల్లే జీవుడు దైవాన్ని చేరగలడు. అవి చేయకపోతే దయ్యమై గాలిలో తిరుగుతూ వుండును. కర్మలు చేయనిదీ జీవుడు పవిత్రుడు గాడు. మంచి నడవడీ రాదు. దైవాన్నీ గుర్తించలేడు అని జైమిని తర్కిస్తే మహర్షి నవ్వి కడుపేదలూ నిరుపేదలు, పశుపక్ష్యాదులు, యింద్రియ వైకల్యం అంగ వైకల్యం గలవారూ, మృగాలూ, చెట్లూ, చేమలూ, జలచరాలూ యివి చేయలేవు. అవెక్కడికి పోతున్నాయి? విశ్వాత్మలోకే చేరుతున్నాయి అని ఓడించాడు జైమినిని.

పరమాత్మ లేదా దైవం జీవుల నాశ్రయించి వుంటాడని చెప్పుకుంటున్నాము. కనక మానవుడు కొన్ని అపూర్వ అమోఘ శక్తులను సంపాదించి దైవంతో సమానం కాగలడు. కావచ్చు అని జైమిని వాదన.

''సమానం కాగలవేమోగాని, విశ్వాత్మ, విశ్వరూప నిత్యుడివి కాలేవు. అతడు నిత్యుడు, నిండివుండు వాడు, నామరూప రసగ్రంధాదులు లేనివాడు. అగ్నిలో అగ్ని, గాలిలో గాలి, ఆకాశమును దాటీ వ్యాపించియున్నవాడు'' అని ఓడించాడు.

అప్పటికీ జైమిని మారలేదు. గురువుగానం చేసిన ''జయ'' విన్నాడు. తానూ అల్లి భూర్జరపత్రాల మీద కెక్కించి గురువుకు వినిపించాడు. జయ అంటే భారత కథ. జైమిని భారతంలో పాండవులు ఓడిపోతూ, చచ్చిపోతూ, కృష్ణపరమాత్మ దయవల్ల యెలాగైతేనేం బతికి బట్ట కడతారు.

''జైమినీ! నీకు సరైన దృక్పథం అలవడలేదు. ''జయ'' నీకు అర్థం గాలేదు. పాండవులనగా పంచభూతాలు, లేదా పంచేంద్రియాలు. వీటిని సర్వశక్తిమంతుడు నడుపుతాడు. పరమాత్మని ఆధారం చేసుకుని అవి పనిచేస్తాయి. అన్నిటికన్నా పైవాడు పరమాత్మ. ధర్మ స్వరూపుడు. ఓడుతున్నట్టు కనబడుతున్నా, అది భ్రమే సుమా, చివరికి గెలిచి స్థిరతను చూపేది ధర్మమే. అదే సత్యము. నిత్యము పరమాత్మ అని పిలువబడుతున్నది.

జైమినీ నీవు మానవులకు తప్పుదోవచూపావు. గట్టిగా చెప్పినా, అర్థమూ చేసుకోని, వినిపించుకోని మానవులకు పరమాత్మ స్వరూపం చెప్తూనే వుండాలి. చేతనైతే చూపుతూనే వుండాలి. పరమాత్మకల్ల అని గానం చేశావు. అది దైవద్రోహం. దైవాన్ని వంచించలేవు. ఆ భూర్జర పత్రాలు తగలబెట్టు. ఇది గురువాజ్ఞ'' అన్నాడు మహర్షి. జైమిని నిప్పురగిల్చి, కళ్ల వెంట సంతతధారగా నీళ్లు రాలుస్తూ ఒక్కొక్క పత్రమే నిప్పులో వేస్తుంటే దయామయుడైన గురువు జైమిని దుఃఖం చూడలేక, ''గురూ! యీ కొంచెం అట్టే పెట్టుకోనా?'' అని అడిగితే ''అట్టే పెట్టుకో'' అన్నాడు. ధర్మరాజు రాజరాజై అశ్వమేధం చేసే

చోటికొచ్చింది కథ. అర్జనుడు గుఱ్ఱం వెంట వెళ్లాడు. ఆ మిగిలినదే జైమిని భారతం.

అన్ని మతాలూ, హింస, భేదభావం మానమనీ దయను పెంపొందించుకోమనీ ఘోషించాయి.

ఇది కట్టు కథ కావచ్చుగానీ, రసవత్తరంగా వుంటుంది. శంకరులు, గెలుస్తూ అద్వైతమత వ్యాప్తి చేస్తూ, జ్ఞానాన్ని వెదజల్లుతూ, ద్వైతవాది అయిన మండన మిశ్రుని యింటికి శిష్యులతో సహా వెళ్లి వాకిట్లో నిలబడ్డారు.

సన్యాసాన్నీ, సన్యాసులనూ అసహ్యించుకునే మండనమిశ్రుడు శంకరుని గౌరవించక

''భిక్షవేస్తా పో'' అన్నాడు.

''సాధారణ భిక్ష కోసంగాదు వచ్చింది'' అన్నారు శంకరులు.

''మరే భిక్ష కావాలి?''

''వాద భిక్ష పెట్టాలి'' అన్నారు. శంకరుల వారిని ఓడిద్దామనే, వోడించగలననే ధీమాతోనే ''రావచ్చు'' అని ఆహ్వానించారు మండనమిశ్ర.

తీరుగా ఆసీనులైనారంతా.

''యేదైనా పణం బెడితే వాదన పటుత్త్వంగా నడుస్తుంది'' అని గికురించాడు మండనమిశ్రా.

''తప్పకుండాను. మీరే పణం పెట్టమన్నా పెడతాను'' శంకరులు తొణకక్కుండా అన్నారు.

''నేను ఓడిపోతే అద్వైతం ఒప్పుకొని అంగీకరించి దీక్ష తీసుకుని, సన్యసించి, శిష్యుడనై అనుసరిస్తాను. నీవు ఓడిపోతే నీకు పెళ్లి చేస్తాను శంకరా. చేసుకుని కర్మకాండలు ఆచరిస్తూ సంసారివి కావాలి''

''ఒప్పుకున్నాను''

శంకరుల వయస్సు తక్కువ. అనుభవమూ తక్కువే, పఠనమూ తక్కువే ఓడించగలననుకున్నాడు వయసు మళ్ళుతున్న మండనమిశ్ర.

గౌడపాదులు, గోవిందయతి అనేవారు శంకరుల గురువులు. సరైన శిష్యుడందగానే సంతోషించారు. ఒడుగైనవాడు, యెనిమిదవయేట తల్లి అనుమతితో సన్యసించినవాడు శంకరులు. నదిలో స్నానం చేస్తుంటే మొసలి పట్టుకున్నది. తల్లియేమో ఒడ్డున వున్నది.

''అమ్మా! మొసలిపట్టుకున్నది. సన్యాసానికి అనుమతించు. సంతోషంగా పోతాను'' అన్నాడు కొడుకు. తల్లి అనుమతించింది, మొసలి వదిలేసి వెళ్లిపోయింది.

శంకరుని కుశాగ్రబుద్ధి, సత్త్వగుణం గుర్తించారు గురువులు. శ్రద్ధగా చెప్పారు చదువు. ''శంకరా! చదువేమో త్వరగానే ముగించావు. అనుభవం సంపాదించాలి శంకరా. ఆసేతు శీతాచలం పాదయాత్ర చేయాలి. మనుషులు, నమ్మకాలు, రీతి రివాజులు, తీరుతెన్నులు గ్రహింపుకొస్తాయి. అపుడు నిన్ను వాదనలో గెలిచేవాడుండడు. పో. ప్రపంచంలో వున్న అజ్ఞానాన్నీ అవిద్యనూ తుడిచివేయి'' అని దీవించి ధైర్యోత్సాహాలిచ్చి పంపారు గురువులు.

మండనమిశ్రునికి, పండితుడననీ, అన్నీ తెలుసుననీ చెప్పగలననీ ద్వైతాన్ని సమర్థించగలననీ అహింరజో గుణం వృద్ధి అయింది. భార్యపేరు ఉభయభారతి. ఆమె గురువుల వద్ద బాగా విద్య నేర్చింది. విదుషి, మతాచారాలు పాటిస్తుంది.

తీర్పరులు ఉభయభారతిని తీర్పరిగా పిలిచారు. ''నేనిక్కడే కూచుని వాదన వినలేను. లోపల పని చూసుకోవాలి. ఇద్దరి మెడలలో కొత్తగా విచ్చిన పూలదండలు వేస్తాను. పనిచేసుకుంటూ వింటూనే వుంటాను. వచ్చి చూసి పోతూ వుంటాను. యెవరి దండవాడుతుందో వారు వోడినట్లు'' అని నిర్ణయించింది.

అంగీకరించారందరూ. పూలదండవేసి వెళ్లింది. క్రమంగా మండన మిశ్రుని

మెడలోని పూలదండ వాడసాగింది. ఆవేశం వల్ల, సరిగా గుర్తురాక వుద్రేకపడటం వల్లా మండన మిశ్రునికి చమటలు పట్టాయి.

ఉభయభారతి వచ్చి చూసింది.

''శంకరా! నేను అర్ధాంగిని. నన్నూ ఓడించనిదీ విజేతవు కావు. పూర్తి గెలుపుకోసం నన్ను ఓడించాలి''.

''అడుగు మాతా!'' అన్నారు శంకరులు.

కళాశాస్త్రంలో ప్రశ్న వేయుటమే గాక, వంట చేస్తూ వచ్చింది గనక, లోపలికెళ్లి ఒకగారెను అట్లా కాడకుగుచ్చి చూపి, ''అంటే యేమని చెపుతావు?'' అన్నది.

శంకరులు తొణకలేదు ''తల్లీ! పరమేశ్వరి. నేను బ్రహ్మచారిని. ఆర్నెల్లు గడువుకావాలి. తిరిగి వచ్చి చెప్పగలను'' అన్నారు.

''పో శంకరా! అందాకా మేము ద్వైతులమే'' అన్నది.

శంకరులు శిష్యులతో వెళ్తుంటే శ్మశానంలో శవం మీద పడి స్త్రీలు దుఃఖిస్తున్నారు. ఆ మరణించింది రాజు.

'' ఆనందా? నేను పరకాయ ప్రవేశం చేసి, నేర్చి తెలుసుకుని వస్తాను. అందాకా నా శరీరాన్ని ఆ దూరాన కనబడుతున్న పెద్ద చెట్టు తొర్రలో వుంచి కాపాడుతూ వుండాలి. నేను తిరిగివచ్చి తల్లి వేసిన వాటికి సమాధాన మివ్వాలి. మిధ్య అనేది తల్లి కర్ధంగావాలి'' అని ఆదేశించి, శంకరులు రాజు శరీరాన్ని ఆశ్రయించారు. రాజు లేచి కూచున్నాడు.

ఆనాడూ మరియూ యీ నాటికీ దింపుడు కళ్లం అని ఓ రివాజున్నది. శవాన్ని పాడెమీద మోసుకెళ్తూ దోవలో మూడుసార్లూ, చివరికి మూడవసారీ స్మశానంలోనూ ఆగి, మోయుట ఆపి కిందబెడతారు పాడెని. కొనవూపిరన్నా వున్నదేమో, బతుకుతాడేమోనని ఆశిస్తారు. చావు కళపడలేదేస్మృతి తప్పిందేమో అని కట్లు విప్పి తెల్లని బట్ట తొలగించి చూస్తారు. అలా బతికాడు రాజని అంతా

సంతోషించి అందలంలోకూచోబెట్టి రాజధానికీ, రాజ భవనానికీ తీసికెళ్లారు. ఉపచారాలు చేశారు. రాచమర్యాదలు చెల్లించారు.

రాణులూ, మంత్రులూ రాజపురోహితునికి చెప్పారు. ''రాజు చాలా మారాడు. మార్పు కనబడుతున్నది. దయా, మర్యాదా, మన్ననా, మంచీ చెడూ తెలుసుకొని తీర్పు చెప్పటం, సత్త్వగుణం, ప్రేమా, సత్యము, శౌచమూ కనబడుతూ వెల్లడౌతున్నాయి గురూ. వింతగా వున్నది''.

రాజపురోహితుడన్నాడు ''యెవరో మహామహుడు రాజు మీద దయగలిగి, మీ ఆర్తి వినలేక రాజు శరీరాన్నాశ్రయించి మీ దుఃఖం తొలగించాడు. రాజును భద్రంగా కాపాడాలి. ఒంటరిగా వదలి వెళ్లరాదు. అంటిపెట్టుకుని దైవాన్ని చూసినట్టు చూడాలి. రాజ్యంలో నేరాలు తగ్గాయి. పాపభీతి పెరిగింది. ప్రజలలో మానవతా, సానుభూతీ సేవాభావము వచ్చాయి. సుఖాంతులు కలిగివున్నారు. రాజును కాపాడాలి.

రాజపురోహితుని సలహామీద మహామంత్రి, ''అనాథప్రేత సంస్కారం కోటియజ్ఞ ఫలం లభేత్ అని, యెక్కడ యే ప్రేతం కనిపించినా దహన సంస్కారం చేయాలి. ఇది రాజాజ్ఞ'' అని చాటింపించి, భటులకు చెప్పి అన్నివేపులా పంపాడు.

భటులు రాజాజ్ఞ నిర్వర్తిస్తుండగా, ఒక శిష్యుడు చెట్టు తొర్రలో యేదో చూచిరావటం గమనించారు. ''యేమిటి చూచి వస్తున్నాడు తరచూ'' అనుకుని, అనుమానించి, తాము వెళ్లి చెట్టు తొర్రలో చూచారు. ప్రేతం కంటబడింది. దానిని అనాథ ప్రేతం అని నిశ్చయించి, దానికి దహన సంస్కారం చేయాలని బైటికి తెచ్చారు. శిష్యులు మొత్తుకున్నారు. అడ్డువచ్చారు. కాని భటులు వారిని తరిమేశారు. సంస్కారం తంతు మొదలెట్టి చితి పేర్చసాగారు.

ఆనంద అనే శిష్యుడు శరవేగంతో, రాజధాని వేపు రాజభవనం వేపు పరుగుతీశాడు. రాజసభలోకి అడుగుపెట్టగలిగాడు. రాజభోగం అనుభవిస్తున్న గురువు శంకరులను గుర్తించి చేతులెత్తి పెద్దగా మేల్కొలుపుతూ శ్లోకాలు

వల్లించసాగాడు.

''జాగృత జాగృత జాగృతరాజన్'' గురువా నీవు రాజువుగాదు, శంకరుడవు. మేలుకో. వాదనలో పాల్గొని భర్తనోడించావు. భార్య తననూ గెలవాలన్నది అడుగు అనగా కళాశాస్త్రంలో ప్రశ్నవేయగా గడువిమ్మని, అది తెలుసుకోవాలని, సమాధానమిచ్చి మిధ్యా జగత్తును తెలియజెప్పాలని, గెలవాలని వచ్చావు. శరీరాన్ని వదిలి వచ్చావు. రాజా మేలుకో. నీవు రాజువు గాదు. శంకరుడవు. రాజాజ్ఞ అని చెప్తూ నీ శరీరానికి సంస్కారం మొదలుపెట్టారు. నన్ను తరిమేశారు. రాజా మేలుకో. నీవు రాజువు గాదు''.

రాజు నిశ్చలంగా చూచాడు. శ్రద్ధగా విన్నాడు. పరాకు స్తబ్దత వదిలాయి. పోవాలి అనుకుని శంకరులు వెళ్లిపోతున్న శిష్యుని గమనించారు. సింహాసనం మీదున్న రాజు పక్కకి ఒరిగిపోయాడు.

శంకరాచార్య తన బొందిలో ప్రవేశించేప్పటికే, భటులు చితి ముట్టించి వెళ్లిపోయారు. తలవేపూ కాళ్లవేపు మంటలు లేచి కాలుస్తున్నాయి. అగ్ని నాలుకలు చాచుతూ ఆకాశంలోకి లేచింది. శంకరులు ఆశువుగా, విశ్వరూపుని, శక్తిమంతుని తలచి, ''లక్ష్మి నృసింహ! మమదేహి! కరావలంబం'' అని స్తుతించారు. మంటలారిపోయాయి. శిష్యులిచ్చిన చేయూతతో దిగివచ్చి వారి వెంట వెళ్లారు.

మండనమిశ్ర అద్వైతం ఒప్పుకుని, మతం మార్చుకుని సన్యాసానికి సిద్ధంగా వున్నాడు.

ఉభయభారతి రాగా భగవత్పాదులు, ''మాతానేను విడమరిచి చెప్పినా అర్థం గాదు. అది అనుభవైకవేద్యము. లంపటత్త్వం యేర్పడి, మాయలో చిక్కుకున్నవానికి ఆ మాయ తొలగినా, లేక వదిలించుకున్నా అర్థమౌతుంది. బంధం కట్టివేస్తుందిగా నీమాతా! అది శాశ్వతం గాదు. తాత్కాలికమే. మోహం విచ్చిపోతుంది. బంధం శాశ్వతమనుకోటమే అజ్ఞానం లేదా మాయుకు లోనుకావటం ఆభోగం, బంధం, శరీర సౌఖ్యమూ శాశ్వతంగాదని తెలుసుకుని

చల్లలో వెన్నముద్దలాగా బంధింపబడక, లోనుగాక సత్యాన్ని, నిత్యమైన దాన్నీ గుర్తించగలగాలి. తినుబండారాలెంత నోరూరించెవైనా, తినగా తినగా అవీ మొహం మొత్తుతాయి. బంధమూ మోహమూ గూడా త్వరలోనే మొహం మొత్తి స్వార్ధం తెలిసిపోతుంది. ఆత్మ స్వరూపమొక్కటే శాశ్వతమైనది. దానిలో పుట్టిపెరిగి కదుల్తూ, భ్రమ ప్రమాదాలకు లోనౌతూ పరిపూర్ణనిలోనే కలిసిపోతావు. ఉభయభారతి నమస్కారం చేసి, ''నేనూ అద్వైతం అంగీకరిస్తున్నాను. నేనూ సన్యసిస్తాను'' అన్నది.

''మాతా! స్త్రీకి సన్యాసం లేదు. ఆమె పరమేశ్వరీ అంశ. ఆమె ప్రతిబింబం. రూపుదాల్చిన దయ. ఆమెలోని ప్రతీ అణువు తల్లి అనే చెపుతాయి. జ్ఞానోదయం స్త్రీ వల్లే కలుగుతుంది. మాత ఆనందమయి. ఆమె యిచ్చే ఆనందం పసితనం నించీ, చివరివరకూ చూస్తూ అనుభవిస్తూ గూడా యిలా వుంటుందని వర్ణించలేము చెప్పలేము. నీవు శక్తివి. విశ్వవ్యాపివి. నేటినుంచీ మఠాధిపతుల పేరు చివర, పీఠాధిపతుల పేరు చివర, మతగురువుల పేరుచివర నీ పేరుంటుంది. భారతి, సరస్వతి, ఆనంద, కుమారగిరి అని వుంటాయి. నీ చైతన్యం చూసి శివ ఆనందిస్తూ ఆనంద తాండవం చేస్తాడు. త్రిగుణాలకు బిందువు నీవు. రజోగుణం ద్వారా సృష్టి చేసి పెంచి, ఆనందించి, తమస్సులో కలిపేస్తావు. ఆ కనబడే నలుపు, లేదా నీలిమ నీవే. దానిలోనే మళ్లా మళ్లా రజస్సు జ్వలిస్తుంది. సత్త్వమునిత్యమై వుంటుంది. త్రిరేఖలు తీర్చి మధ్య యెర్రని బొట్టుబిందువులాగా పెట్టుకోటానికదే అర్థం మాతా శలవు. నమస్తే''.

శిష్యులతో వెళ్లిపోయారు ఆదిశంకరులు. ఆ శంకరులు అంతటితో ఆపక వివిధ మతాచార్యుల కలయిక వల్ల జరిగిన సభలో పాల్గొని తన వాక్పటిమతో యితరమతాలలోని బోధనలను వుదహరిస్తూ దర్శనా ద్వైతము నిరూపించారు. మతాలన్నీ చెప్పేదొకటే. బహుధా వదన్తి. విధాలు వేరు. భాషలు వేరు దర్శన మనగా మతము. ఒక మతానికీ మరొక మతానికీ భేదాభిప్రాయమూ లేదు వైరమూ లేదు. బ్రహ్మ సత్యం జగన్మిథ్య అని ఒప్పుకుంటున్నాయి మతాలన్నీ కంటికి

కనబడేవి పుట్టి పెరిగి నశిస్తాయి. నిత్యమైనట్టిది బ్రహ్మమే. అట్టి బ్రహ్మను కనుగొనాలి. అదే శంకర విజయం. ఆపాటి చెప్పగలిగినవారూ లేరు, తక్కిన దర్శనమును చదివి అర్థం చేసుకున్నవారూలేరానాడు.

2

అతని పేరు వేదపురుష. రెండవవాని పేరు ఆంధ్రా షా. మూడవవాని పేరు ఆనంద. ఇంకావున్నారిట్టివారు. వారిలో వారికి వైరం లేదు. హాస్య మాడుతారు, గేలి చేసుకుంటారు. వారు ద్వంద్వాతీతులు, ఆకలి దప్పిక, సుఖసౌఖ్యాలు, కలిమిలేములూ, రాత్రంబగళ్లు వంటి వాటి కతీతులు మానావమానాలు సమానం. మతమంటే గౌరవమూ ఆసక్తీ వున్నాయి. పాదయాత్రలిష్టం. ధనార్జనా, దానిని కూడబెట్టటంలోనూ ఆసక్తి లేదు. లక్షాధికారైన లవణమన్నమెగాని మెరుగు బంగారంబు మింగబోడు, అని తలచి మిలియన్లను నిరసిస్తారు. జానెడు పొట్టకి పిడికెడన్నం, మానం కాపాడుకునేందుకు మూరెడు గుడ్డ చాలు అదీ ఆశయం. కూడబెడితే తుదకు దొంగలకగునో దొరలకగునో అనుకుంటారు. మేడలు మిద్దెలు లేవదీస్తే, చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనయట్లు, వంచకులు, సోమరులు వాటి నాక్రమిస్తారు. అదీ ఐడియా.

అది విశ్వకళాపరిషత్తు ఖాళీ స్థలం. యూనియన్ అధ్యక్షుని యెన్నికలు జరుగుతున్నాయి. ఒక యువకుడు సిద్ధాంతం పూర్తిచేసి పరిషత్తులో దఖలు పరిచి ఒక సంవత్సరమైంది. ఈ మధ్యే వైవా ముగిసింది. ఆచార్య బిరుదు ప్రధానం నిశ్చయింపబడింది. యువతరం విద్యార్థులకతను ప్రీతిపాత్రుడు. పరిషత్తు సావనీర్ విడుదల చేయుటంలో సహాయసంపాదకుడు. తమ విభాగ మాసపత్రికకు సంపాదకుడు. మెప్పు పొందే సంపాదకీయం వ్రాస్తాడు. సాటి విద్యార్థుల జటిల సమస్యలు పరిష్కరించగల సమర్థుడు, మతభేదం, వర్ణభేదం పాటించనివాడు. తరతమ భేదం లేదు. పక్షపాత మసలే లేదతని రక్తంలో. తల్లి కాయకష్టం మీద జీవించే సామాన్య స్త్రీ. కష్టే ఫలి అని విశ్వసిస్తుంది. ఆమె గర్భ శుక్తి ముక్తా ఫలమే శరత్. చూపులకు శరత్కాల చంద్రుడల్లే వుంటాడు. నవ్వు వెన్నెలలు

విరజిమ్ముతాడు. ఆహ్లాదకరంగా మాట్లాడుతాడు శరత్.

శరత్‌కి ప్రత్యర్థులుగా మరో యిద్దరు నిలబడ్డారు. వారికీ మద్దతున్నది. మిత్రులూ వున్నారు. విదేశాల నించి వుపకారవేతనం మీద చదువుతున్నవారూ వున్నారు.

రంగు కాగితాల తోరణాలు గాలికి వూగుతూ రెపరెపలాడుతూ సంబరం వెల్లడిస్తున్నాయి. ఓటింగ్ చక చకా జరుగుతున్నది. ఇవతలగా ఫుట్‌పాత్ మీద తినుబండారాలు, వేయించిన వేరుశనగ కుండీలు, వుప్పుతో వుడకబెట్టి వేడినీళ్లలో వుంచి తీసి కాగితం ప్లేట్లలో పెట్టి యిచ్చేవారూ వున్నారు. వ్యాపారం జోరుగా సాగుతున్నది. డబ్బులు రాలుతున్నాయి. లెక్క చూసుకుంటూ మధ్య మధ్య యెన్నికల సందడి చూసి వినోదిస్తున్నారు అమ్మేవారు.

ఒక్కసారిగా కేకలతో హాహాకారాలతో ఆకాశం నిండిపోయింది. విద్యార్థులు పరుగెత్తుతున్నారు. శరత్తును ఒక యువకుడు పొడిచాడు. యేమరుపాటుగా వున్న శరత్ నేల కొరిగాడు. పారిపోతున్న వానిని చేతిలో ఆయుధంతో సహా పట్టుకోవాలని కొంతమంది అతని వెంటబడ్డారు. దూసుకుపోతున్న బాణంలాగా పోతున్నడా యువకుడు. ఆనంద పోలీసులను తెచ్చాడు వారు పరిషత్తు ఆవరణలోనివారే. అతని మిత్రుడు పురుష అంబులెన్సుకు ఫోన్ చేశాడు. క్షణంలో పరిషత్తు అంబులెన్సే వచ్చింది. వీరు ముగ్గురూ మరికొందరూ సాయంపట్టి గాయపడినవానిని అంబులెన్సులో వుంచి పెద్దాసుపత్రికి పోనీమన్నారు. అక్కడ ఎమర్జన్సీ రూమ్‌లో వుంచి వైద్యులకంతా చెప్పారు. చాలా రక్తం కోల్పోయాడని తెలగానే గ్రూపు చూసి ఆనందతానిస్తానని ముందుకొచ్చాడు. రక్తదానం జరిగింది.

ఆ రాత్రి గడవలేదు. ఆచార్యగాబోయే శరత్ బతకాలని ప్రయత్నించి, పోరాడి పోరాడి అలిసి దీర్ఘనిద్రలోకి జారాడు. దేహయాత్ర చాలించాడు. ఆత్మీయులు, ప్రేమించే విద్యార్థులు, వైద్యులు శక్తిమేరకు శోకించి శోకించి వ్యథచెంది సొమ్మసిల్లారు.

3

విశాలమైన న్యాయస్థానంలో బోనులో నేరస్థుడు గౌతమ్. వురఫ్ తథాగత నిశ్చింతగా బోను పట్టుకుని నిలబడి వున్నాడు మాజిస్ట్రేట్ కొండల్రావ్ శాస్త్ర ప్రకారం ప్రిలిమినరీ హియరింగ్ విన్నారు.

న్యాయస్థానం సాక్షులతో వైద్యులతో, రక్షణశాఖవారితో కిటకిటలాడింది. ఆత్మీయులు కళ్లప్పగించారంతే.

న్యాయనిర్ణేత ఫార్మల్‌గా నేరస్థునడిగారు.

''యేమని చెప్పుకుంటావు. నీకై పోరాడే న్యాయవాదిని పెట్టుకున్నావా? ఆలోచించే చెప్పు''.

'సత్యమే పల్కుతున్నాను. నేను నేరమూ చేయలేదు. దోషినీ గాను. మతాచారం పాటించాను'' అన్నాడు నేరస్థుడు.

''యెంత తల బిరుసు. పట్టపగలు హత్య చేసి, దోషినీగాను నేరమూ చేయలేదు అనటమే గాక మతం ప్రసక్తి తెచ్చావే. సమర్ధించుకుందామనే''.

నేరస్థుడు తొణక్కుండానే అన్నాడు ''నేను మతంలో చెప్పబడిందే చేశాను. దోషినెలా అయినాను?''

''మతం యేమని బోధించింది?''

''బిద్రే చేసిన వానిని, మిత్రుడయేదీ, శత్రువయేదీ, యెవరయేదీ చంపి వేయాలి పాతకమంటదు. ఒక మతం స్త్రీ పురుషులు యెన్నిసార్లయినా, యెన్నేళ్లొచ్చినా పెళ్లి చేసుకోవచ్చని పర్మిషనిచ్చింది. ఆ పర్మిషనుతోనే ఈ మధ్య తొంభైయేళ్ల స్త్రీ తొంభై అయిదేళ్ల పురుషుని పెళ్లాడింది. మరో మతం చెప్పేది అర్ధం చేసుకొని ఆచరించని వానిని చంపేయాలి అని చెప్పింది. ఆ మతస్థులలాగే చేస్తున్నారు. నాలుగు పెళ్లిళ్లకు పర్మిషన్ పొందిన మతస్థులు అలాగే చేసుకుంటున్నారే. వారు నేరస్థులు కానప్పుడు, దోషులూ కానప్పుడూ నేనెలా అయినాను. ఇది చెప్పటానికి న్యాయవాదిని పెట్టుకోవాలా. వాడికి తెలుసునో

తెలియదో విగ్రహారాధన నేరమని పగలగొట్టితే యేమీ చేయలేదే యెవరూ?''.

''కనీసం యెలా బిట్రే చేశాడో తెలుసుకోవాలి. శిక్ష తగ్గించుకోవాలని డిసీజ్డ్ మీద అపనిందలు వేస్తున్నారేమో అనుకుంటారు'' శాంతంగా చూస్తూ అడిగారు న్యాయాధీశులు.

''అపనిందలుగావవి. నేను నకిలీ పిడబ్లుయూతో కలిసి మెలిసి గుట్టుగా తిరుగుతున్నాట. కక్ష తీర్చుకోటానికీ మరియు తీర్చటానికీట. ఎక్స్ట్రిమిస్టుతోనూ జతగట్టి మందుపాతరలు తయారుచేస్తూ మారువేషంలో వుంటానుట. చదువు అనేది ముసుగుట దురాగతాలు దారుణాలు దౌర్జన్యాలు చేయుటంలో ముందడుగు వేస్తున్నానుట దొంగనోట్ల రవాణా నేర్పుగా చేస్తానుట. మత్తు పదార్థాలు గుట్టుగా అందించి అమ్మించి డబ్బులో తేలిట్లాడుతున్నానుట న్యాయాధీశా.

అందించాల్సినంత అందిస్తే హత్య చేయుటానికీ వెరవనుట. అలా నమ్మించాడు నా వారిని'' మీ అబ్బాయిని కాపాడుకోండి. మొక్కై వంగనిదీ మానై వంగుతుందా. హీ యీజ్ గోయింగ్ టు బి ఎ క్రిమినల్'' అని అదరగొడితే మా వాళ్లు నన్ను డిజోన్ చేశారు. ఇంటికి రావద్దని గెంటేశారు న్యాయాధీశా! మిత్రద్రోహి శరత్, నా జీవితం నాశనమైంది''.

''నీ జీవితం నీ పన్లవల్లే అలా అయిందని తేలింది గౌతమ్ వురఫ్ తథాగత్. చెక్ చేయుమని సూచిస్తే బిట్రేయర్ యెలా అయింది. శరత్ చెప్పినదాంట్లో నిజమున్నదని నీ మాటలవల్ల తేలింది. పోనీ దీనికేమని పేరు పెడతావు గౌతమ్. ఒక యువతి శరత్‌ని పెళ్లాడ నిశ్చయించుకున్నది. ఆచార్య బిరుదు చేతికి రాగానే చేసుకుందామన్నాడు శరత్. యెటునించీ అభ్యంతరం రాలేదు. కాని ఆ యువతి మేనమామ కొడుకు'' అని తలవంచుకుని నవ్వు నొక్కిపట్టాడు న్యాయాధీశుడు. ఆ యాక్షన్ కంటబడినా నేరస్థుని కర్థంగాలేదు.

'' ఆ రౌడీ షీటర్ నీకు ప్రియమిత్రుడు. ఇంకెటువంటి వారు వున్నారో తెలుసుకోవాలనుందా? బరువైన పర్స్ పొట్టపగిలేట్టున్నది. నీ జేబులో కూరి,

ఆ పెళ్లి ఆపేయాలంటే మర్డరొక్కటే మార్గం. మాట నిలబెట్టుకో తథాగత్. నేను వాహనంతో రెడీగా వుంటాను. నిన్ను ష్యూర్‌గా తప్పిస్తాను'' అని నమ్మించి విదేశీ సరుకుగూడా ఎంజాయ్ చేయమని అందించాడు. నీకీ మధ్య దిలాసాగా తిరగబడటానికీ భోగాలకీ డబ్బెక్కడిదని సమర్థించుకుంటావు? నీవు కొన్న కొత్త మారణాయుధానికి లైసెన్సు సంపాయించావా? సాక్షులరుగో. చిత్రాలివిగో. మతమేమంటున్నదో తెలుసుకోవాలి'' అంటున్నారు న్యాయాధీశులు.

నేరస్థుడు కన్ను మూసి తెరిచేలోపల బోనులోంచి దూకి పారిపోసాగాడు. లేడిలా పరుగెత్తగల ఆనంద, సివంగిలా దూకగల షా. భల్లూకప్పట్లుగల పురుష పట్టేశారు. రక్షక భటులూ చేతులు కలిపారు వారితో. పెనుగులాడుతూ ఓడి నడిచివస్తున్న నేరస్థునితో పురుష అన్నాడు. ''యేమతంలో పుట్టావో దానిని రోసి సవిత్తల్లి నాశ్రయించావు. మతం పర్మిషనిచ్చిందన్నావు. దమ్మపదం, మహా వగ్గ అభివృద్ధిలోకి రాబోయే యువకుని పాడవమన్నాయా? త్రిపీటకాలు వినిపించారు పెద్దలు. వైదిక, సనాతనాల్లో హింస, దోపిడీ, వంచనా, మోసమూ, యెక్కువ తక్కువలూ వున్నాయని యెత్తి చూపారు. నమ్మవు. కాని వెర్రివాడా సవిత్తల్లి నిన్ను సరిగా పెంచలేదు. కన్నతల్లి బోదలో వచ్చి ఆచరించావు ఔనా? శరత్ వంటి వెలలేని రత్నం మరొకటి తయారుకావటానికెన్నేళ్లు పడుతుందంటావు? కన్నతల్లినీ, సవిత్తల్లినీ గూడా అవమానించావు. త్రోసిరాజన్నావు. నేరం చేసి పారిపొమ్మనే మతం పేరేమిటి? అది నీకేమగును?''

పెనుగులాడుతున్న నేరస్థుని మెడలోని గొలుసునుండి గుళిక తీశాడు ఆనంద. జేబునుండి పిస్టల్ తీశాడు రక్షకభటుడు.

''అది బిత్రే చేయటం గాదే తథాగత్. నీ శ్రేయస్సు కోరి చెక్ చేయమని హెచ్చరించి వుండాలి శరత్. అతని హెచ్చరికలో కొంత నిజమున్నదే. ఒకమ్మాయి శరత్‌ని పెళ్లాడగోరి తనవారి నెదిరించాల్సి వచ్చింది. ఆ యువతి మేనబావ నీ గాఢ మిత్రుడు. నీకు రొక్కం అందించాడు. మర్డర్ చేసి మాట నిలబెట్టుకుంటే యింకా అందుతుందని ఆశపెట్టాడు. విలాస జీవితానికీ, ఆయుధాలు కొనటానికీ

డబ్బెక్కడిదంటావు గౌతమ్!'' అన్నాడు ప్రాసిక్యూటర్.

నిరుత్తరుడైనాడు హంతకుడు చూస్తూ వుండిపోయాడు.

''యెవరన్నా క్రాసెగ్జామినేషన్ కోరుతున్నారా?''

పురుష లేచి వచ్చి, బోను వద్ద నిలబడి దోషి నడిగాడు.

''కన్నతల్లి వంటి మతాన్ని ఛీకొట్టి సవిత్తల్లి తీయని బోధలకు ఆమెను చేరావు. దమ్మపదం, మహావగ్గ యేమని చెప్పాయి? వైదిక లేక హిందూ మతంలో, హింస, దోపిడీ, వంచనా, ధనాశ మోసము వున్నాయని ఛీత్కరించావు కాని నీవు సవిత్తల్లినీ గౌరవించలేదు. కన్నతల్లి వంటి మతంలో చెప్పినట్టే చేశావు. ఔనా? యెలుకతోలు తెచ్చి యెంతగానుతికినా అన్నాడు ప్రజాకవి. మానసికంగా పూర్వాశ్రమాన్ని దాని పంథాను వదిలించుకోలేక పోయావని తేలింది. తల్లినీ, సవిత్తల్లినీ గూడా అవమానించావు. దొంగ దెబ్బ తీసి పారిపొమ్మని చెప్పేదే మతమందాము? మతాలను నిరసించే నిన్ను మెచ్చాలి. కాని జాతిరత్నం వంటి శరత్ వంటి మరొక యువకుడు తయారు కావటానికెన్నాళ్లు పడుతుందో వూహించగలవా? ఆ రత్నానికి చెకింగ్ యిచ్చి ఆ రత్నాన్ని మరింత విలువదెచ్చి ఆకర్షవంతంగా చేయగల నిపుణులు కొల్లలుగా వున్నారా? మతం వదలి రత్న పరీక్ష నేర్చేస్తే బాగుండేది రాహుల్'', అని అసలు పేరుచ్చరించగానే హంతకుడు వెర్రిమొహం వేశాడు.

4

మళ్లా పాదయాత్ర సాగించారు, పురుష, ఆంధ్రా షా ఆనంద. ఒక వృద్ధురాలు చెరువుకెళ్లి మంచినీళ్ల బిందె నెత్తికెత్తుకుని వస్తూ, బడలి ఆకలికి నకనకలాడుతూ, దాహార్తితో నడిచి వస్తున్న వీరిని చూసింది. దారికడ్డమెళ్లింది.

''బాబులూ! పొద్దు నడినెత్తి కెక్కింది. భోజనం చేతురుగాని రండి. ఇల్లు దగ్గరే. కొడుకు అత్తారి వూరెళ్లాడు. కూతురు మేనత్తకి తోడుగా యాత్రా టికెట్ మీద వెళ్లింది. ఇంటాయన తిరణాలకెళ్లాడు పట్నం. మీకు పెట్టి నే తింటా.

ఆత్మారాముని పూజించాలి'' కుడిచెయ్యి వూపుతూ ఆహ్వానించింది.

అన్నపూర్ణా దేవిలాగా కనబడింది. ఆకలి బాధ తెలుసేమో లేక మనుషుల విలువ గుర్తిస్తుందేమో అనుకుంటూ తలలెత్తి చూసి మారుమాటలేక ఆమెననుసరించారు దోవలో ఆనందసంతోషంతో చిటికెలేస్తూ ''భజగోవిందం, భజగోవిందం భజగోవిందం మూఢమతే. సంప్రాప్తే సన్నిహితేకాలే నహి నహి రక్షతి డుకృఙ్ కరణే'' అని పాడుతూ నడుస్తున్నాడు.

''అంటే యేమిటి? బాబులూ! నాక్కూడా చెప్పవూ? మంచి మాట వినాలని వుంటుంది'' అన్నది. నడుస్తూనే షా అన్నాడు. ''అంటే పెద్దమ్మా! ఒక మూఢుడు కృఙ్ కరణే అనే పదాన్ని వినపడేట్టు జపిస్తుంటే ఆదారిన వెళ్తూ చూసి విన్న ఆది శంకరులు, ''అమాయకుడా! డుకృఙ్ కరణే అనేది రక్షించదు. గోవింద, గోవింద అని భజించాలి'' అన్నారుట.

గోవింద అంటే నానార్థాలున్నాయి. ఇంద్రియములను జయించినవాడు. గోవులను కాపాడువాడు. వేదాలను రక్షించినవాడు. స్త్రీలను కాపాడగలవాడు. అతడు పరమాత్మే. వివిధ రూపాలలో భువికి దిగి ప్రాణులను కాపాడిన గోవిందుని భజించు''.

'' ఇవాళ మంచి మాట విన్నా బాబులూ. ఇదే యిల్లు. రండి'' అన్నది మెట్లెక్కుతూ.

బిందె లోపలపెట్టి వచ్చి అన్నది ''మీరు స్నానం కానిచ్చి వచ్చే లోపల నేను అరిటాకులు పరిచి వడ్డిస్తా. దొడ్లో బావి, అక్కడే తాడున్న చేదా వున్నాయి. మంచినీళ్ల బావికెళ్లి మంచినీళ్ళు తెచ్చాను''.

శుచియై వచ్చి కూచోబోతుండగా వారపత్రిక కంటబడింది. పురుష తీసి పేజీలు తిప్పి చదువుతూ, వింత చూసినట్లు కుతూహలంతో చదివి మిత్రుల వంక చూశాడు. వారికందించాడు. వారు ఒకరి తరవాతొకరు చదివారు మర్డర్. కేసు వివరాలు – కోర్టులోనే వెల్లడైంది వైనమంతా.

''వారి మతం చెప్పినట్లు అక్షరాలా చేశాడు హీరో. పేరు చూసే మతం పేరు తెలుసుకోవచ్చు. నాల్గు కానలకీ కట్టి మూతికి కట్టుకుని జీవహింస జరక్కుండా భద్రపడతారు. అవసరానికీ, ఆపదలో వున్నప్పుడు, గొరతపోతున్నప్పుడు ధనమందించి, వివరంగా పత్రం వ్రాయించి వడ్డీరేటు చూసి భయపడకండి అని ధైర్యవచనాలు పలుకుతారు. మంచి నీళ్లగ్లాసు మీద రుమాలా వేసి మంచి తీర్థం తాగుతారు జీవహింస జరక్కుండా. అట్ మోస్ట్ భద్రతలు పాటిస్తారు వారు. కుక్కలకు చపాతీలు వేస్తారు. దయ అనగానేమో ప్రాక్టికల్సు చేసి చూపుతారూ'', మిత్రులకు వ్యంగ్యమర్థమై, బాధ నణిచి, నవ్వు మొహాలు పెట్టారు. ''వడ్డించానురండి బాబులూ! యెందుకలా ఒకరి మొహాలొకరు చూసుకుంటున్నారు? పత్రికలో విషయమా? నా మనవడు తెప్పించుకుంటాడా వారపత్రిక. బికాం చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఒక ఆసామి పిల్లను చూసిపొమ్మని పదే పదే అడుగుతూ వాడి చుట్టూ తిరుగుతున్నాడు. ఇవాళ ప్రయాణం ఖర్చులు చేతబెట్టి గట్టిగా చెప్పి వెళ్లాడు పిల్ల తండ్రి. డిగ్రీ అందుకున్నాక చేసుకుంటానంటే, ''డిగ్రీ రాక యెక్కడికి పోతుందిలే. వుద్యోగము నేనిప్పిస్తా బాంకులో. నా కూతుర్ని యింట్లో కట్టేయటం అసాధ్యమౌతున్నది. క్షణం యింట్లో కాలునిలవదు దానికి. యెక్కడకెళ్తుందో యేమో. ఇంట్లో వారిస్తే, 'పనిచేసే వెళ్తున్నా'' అని పరుగుదీస్తుంది. వేడుకగానీ బాబులూ. కావాలంటే పైకి చదివిస్తా. మీ వాళ్లతో ఒప్పందం చేసుకోవాలి. రా. బాబూ'' అని వూదరపెట్టి వెళ్లాడా ఆసామీ''. పనస చదివింది పెద్దమ్మ. పీటలమీద కూచుని అన్నం మీద చెయ్యివేయగానే నేయి వడ్డించింది. చల్లని మంచి నీళ్ల గ్లాసులూ, పదార్థాలు వేడిగానే వున్నాయి. ఒక్కొక్కటే పూర్తిచేస్తుంటే చాలా రుచిగా వున్నాయి. నేయి ఘుమఘుమలాడుతున్నది. '' ఇవాళ మీరిద్దరేగా పెద్దమ్మా. మనమడూరికి వెళ్లెనుగా, ఇన్ని పదార్థాలెందుకు చేశావు పెద్దమ్మా? రోజూ యిన్నీ చేస్తావా యేం? మేమొస్తామని కలగన్నావా? మంచినీళ్లు మోసుకురావాలి గూడాను. సాయమున్నదా? పాడీ చేయాలేమో. ఇది బజారు నేయి గాదు. పందెం వేస్తా''

అంటున్నాడు. పురుష నేయి పూర్ణం మీద పులిహోర మీద వేసుకున్నాడు. అన్నం పప్పూ కలిపి నేతితో తింటే అమృతం.

''కలగాదు బాబులూ. మా కోసమే వంటచేయను. ఆఫీసర్సు వచ్చి తినిపోతారు లేదా, కారేజీలో సద్ది పంపమని మనుషులను పంపుతారు. పేయింగ్ గెస్ట్సు అంటారేమీరు అదీ పేరు'' అన్నది మారు వడ్డన చేస్తూ.

'' ఏకాకిలా పేయింగ్ గెస్ట్సు?'' షా అడిగాడు.

''కాదు బాబులూ! ఒకాయన ఆలిని పుట్టింటికి తోలేశాడు. భరణమిస్తాడు. మరొకడు చిన్న మేడలో వుండమని భార్యనందులో వుంచి లోపం లేకుండా చూస్తాడు. డైవోర్సు అవమానంట. బొత్తిగా పడదిద్దరికీ. యతంటే ప్రతి. యెడ్డెమంటే తెడ్డెం. పిల్లలు లేరు. మూడో బాబులు భార్య అనాచారం అలవాట్లూ అతి వాగుడూ నచ్చక ఆమె అన్న యింట్లో దింపి వచ్చాడు ఖర్చులిచ్చుకుంటాడు'' అన్నది చల్లని మంచినీళ్లతో గ్లాసులు నింపుతూ.

'' ఐస్ వాటరల్లే వున్నదే. ఫ్రిజ్ వున్నదా పెద్దమ్మా'' ఆనంద నీళ్ల గ్లాసు యెత్తి పోసుకుంటూ గటగటా తాగేశాడు.

''అలా నీళ్లతో పొట్టనింపితే వడ్డించినవెలా తింటా బాబులూ! ఫ్రిజ్ అక్కర్లా. యిసకమీద కుండ వుంచి మూతపెట్టి చల్లని బట్ట తడిపి కప్పి నీళ్లు చల్లుతూ యిసకా తడిగా వుంచితే చల్లగా వుంటాయి''.

'' ఆత్మీయులు లేరూ ఆపీసర్లకీ?'' పురుష అడిగాడు.

''వున్నవారేమో, నేనడను, వారూ నచ్చలేదేమో. కొంతమందికి ప్రైవేసీ నిలుపుకోవాలని వుంటుంది. రొదా, నసా నచ్చవు''.

''నిమ్మవూరగాయ ముక్కంతా తినేశా పెద్దమ్మా. యెంత రుచి నిజం చెప్పాలంటే యీ వూరిల్లే స్వర్గం. అమృతం వడ్డించావు. సాయం సంగతి చెప్పలేదే'' అన్నాడు షా.

''సాయం చేసే వారొచ్చి తిని వెళ్తారు. వెచ్చాలు, కొట్టువాడే వచ్చి అడిగి

తెలుసుకుని పంపుతాడు. పాలేరు గేదెనూ ఆవునూ చూసి, పాలు తీసి యిచ్చి, నేల శుభ్రం చేసి బూడిద చల్లుతాడు. చద్ది తిని తోలుకెళ్తాడు. యాడాదికే జీతం గుడ్డలూ''.

భోజనాలయాయి. చిరిచాపలు పరిచి తాంబూలం సరంజామా, పేము పళ్లెంలో వుంచి వెళ్లింది పెద్దమ్మ.

''నేనూ భోంచేసి వస్తాను బాబులూ. తలుపు ఓరగా వేసి వున్నా బాగానే వినబడుతుంది. మీరు చదివింది నాకూ చెప్పాలి వింటూ భోం చేస్తా. చత్వారానికి తోడు ఆ భాషా రాదు నాకు''

'' ఆర్మీ రిటైర్డు పర్సనల్ ఫోన్ మోగింది. ''పొద్దున్నే యెవరబ్బా!'' అని విసుక్కుంటూ నైట్ డ్రెస్‌లోనే నిలబడి రిసీవర్ చెవికానించుకున్నాడు ఆర్మీ పర్సనెల్.

''సారీ! ఫ్రెండ్! బాడ్ న్యూస్. ఎమర్జన్సీ కేసొస్తే చూస్తున్నా. స్లీపింగ్ టాబ్లెట్సని తెలియక సీసాడు బిళ్లలను కొని తిన్నాడు బిడ్డ ఆరోయేడు. తాతగారా సీసా బల్లమీద వదిలి నిద్రబోయాడట. తెలివి తెప్పిస్తున్నా బిడ్డకి'' అంటున్నాడు.

''యెవరి బిడ్డకో తెలివి తెప్పించాలని ఆదుర్దాపడుతున్నావని చెప్పటానికా నన్నులేపావూ? నీ దయార్ద్ర హృదయం తెలుసులే'' అని విసుక్కుని రిసీవర్ని క్రెడిల్‌లో పెడ్తుండగా మళ్లా మోగింది మళ్లా యెత్తి చెవికానించుకున్నాడు ఆర్మీ పర్సెనెల్.

'' ఆదుర్దా యెవరి బిడ్డను గురించి గాదు మైడియర్ ఫ్రెండ్! సయానా నీ ఒక్కగానొక్క చెల్లెలు ముకుళనెవరో దారుణంగా హత్య చేసి సైడు కాలవలోకి తోసి పరారైనారు. మీ బావ పాలపాట్లాలందుకోటానికి తెల్లారుతుండగా లేచి వచ్చి చూస్తే గేటు తీసి వుంటే అనుమానించి యువతలి కొచ్చి చూసి భార్యను తీసి కార్లో వేసుకొచ్చి డెత్ సర్టిఫికేట్ యివ్వమన్నాడు నన్ను. నివ్వెరపోయాను. దోవలో నర్సింగ్ హోమున్నదే యిరవైనాలుగ్గంటలూ పనిచేస్తుంది. పరీక్షించే

యిచ్చా) డెత్ సర్టిఫికెట్. గ్రూసమ్ మర్డర్'' అంటుండగా డిస్‌కనెక్ట్ అయింది లైట్లు పోయాయి. కరెంటు లేదు.

అదిరిపోయాడార్మీ పర్సనెల్. మంచి ఒడ్డూ పొడుగూ ఆరడుగుల మనిషి నెరసిన మీసాలు. బట్టతల. గిర్రున తల తిరుగుతూ గతం పరుగెత్తింది. తమ తల్లీ దండ్రీ ప్రమాదంలో పోతే. బాబాయీ పిన్నీ పెంచారు. వారికి సంతులేదు. పిన్న పోరే పెడితే ఒక టీచర్ని పెళ్లాడాడు బాబాయి. ఆమె కొక కూతురు కలిగింది. కాని ఆరవరోజున సెప్టిక్ ఫీవరొచ్చి పోయింది. రెండవ పిన్ని సుగంధి. అదే వార్డులో మరో ఆరుగురు బాలెంతలు, పదిరోజులు వెళ్లకముందే పోయారు. కేసైంది. సరిగా స్టెరిలైజ్ చేయని పనిముట్లు వాడింది అని డాక్టరమ్మను హెల్ప్ చేసిన నలుగురు నర్సెస్‌ను సస్పెండ్ చేశారు అధికారులు. బాబాయీ పిన్నీ ఆ పసికందును ప్రాణప్రదంగా పెంచారు. ముద్దులు మూటగట్టినట్లుంటుంది కూన. ఆ ముకుళకు బాల్యం వదలక ముందే పిన్నీ బాబాయీ ప్లేన్ క్రాష్ అయిపోయారు. తనకు పెళ్లి అయింది. ఆర్మీలో చేరాడు. తనకు మాలిమి అయిన ముకుళను పెంచటం సులభమే అయింది. పందొమ్మిదోయేట పెళ్లి చేశారు తానూ భార్యా. బావ విదేశంలోనే డిగ్రీ పొంది జాబూ చేసి నచ్చక స్వదేశం వచ్చి ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో పనిచేస్తున్నాడు. సర్జన్. ఓపెన్‌హార్ట్ సర్జరీలో తర్ఫీదైనాడు. ఆ నర్సింగ్ హోమ్ ఒక లక్షాధికారిణి నడుపుతున్నది. ముకుళకూ బావకూ సంతానం కలిగింది. కవలలు అమ్మాయీ అబ్బాయీ. భార్యా భర్తలకి వయస్సులో బాగా తేడా వున్నది. మొదట్లో ఆ తేడా యిబ్బందులు తెచ్చిపెట్ట లేదు. డబ్బుకీ, అధికారానికీ కొదువలేదు. పిల్లలు బడికి వెళ్తున్నారు. చదువులోనూ ఆటల్లోనూ రాణిస్తున్నారు.

పనివత్తిడి వల్ల, రాబడి చూసి పొంగిపోతున్న బావ రాత్రిళ్లు నర్సింగ్ హోమ్‌లోనే గడుపుతున్నాడు. నాగేంద్ర. నీలివార్తలందాయి ముకుళకి. విదియనాడు కనబడని చంద్రుడు తదియనాడు తనకు తానే జాబిల్లి అయి వెలుగుతూ కనిపించినట్టు భర్త నిజరూపం తెలిసిపోయింది. ముకుళ రక్తం వుడికి

పోయింది చేతి నిండా డబ్బు. రెండు చేతులా ఖర్చు చేస్తున్నా, లేడీస్ మెంబరైనా, రెడ్ క్రాస్ మెంబరై పనిచేస్తున్నా సోషల్ వర్కర్‌గా నలుగురితో తిరుగుతున్నా మనసులొంగక తిరగబడుతూనే వున్నది. సినీఫీల్డులో కొత్తగా పైకి వస్తూ లిరిక్సు వ్రాసిచ్చే భావకవి, ముకుళ యీడువాడే, అందం, హ్యూమర్, స్నేహభావం అన్నిటికన్నా ఆరాధన ముకుళను లొంగదీసాయి. ఒంటరితనం వదిలిపోయింది. కాని తుపానుగాలులు వీస్తున్నాయని గమనించలేదు ముకుళ. పరవశమే మృత్యువని తెలియదు.

పద్మినీ రూటస్ అడుగుతున్నట్లుగా అన్నది ''మనం పెళ్లి చేసుకోవాల్సిన అవసరమొచ్చింది డియర్''.

''నాకు భార్యా పిల్లలున్నారని తెలుసునే నీకు పద్మినీ! భద్రతలు పాటిస్తున్నావనుకున్నాను. రిప్రొడక్షన్ యేజ్ దాటిందన్నావు. మీ అబ్బాయి గల్ఫ్ దేశంలో చేరాడని నర్సింగ్‌హోమ్‌లో జాబ్‌కి తిలోదకాలిచ్చి అబ్బాయి వద్దకి వెళ్లిపోతానన్నావు''.

''నేనూ అదే బేపర్వాలో వుండి. దిలాసాతో వున్నాను. కాని అవసరం వచ్చింది. మా మతం పర్మిషనిస్తుంది నాకు. ముకుళకి మన సంగతి తెలిసిపోయింది. నేనేనా అని ఛాలెంజ్ చేస్తున్నట్లు ఆమే నీ అడుగుజాడల్లో నడుస్తున్నది. నిన్ను తీసికెళ్లటానికి యీ నర్సింగ్ హోమ్‌కి వచ్చినప్పుడు, నా మీద అసూయజెంది స్టాఫ్ చెప్పేశారు. మీ రామె కొంగుబంగారం. లవర్ని తానే ప్లీజ్ చేస్తూ యెదురుపెట్టుబడి పెట్టి వినోదిస్తున్నది''.

'' ఇంట్లో ఒంటరిగా లేదే''

''మస్కా వేయటంలో నేర్పరి అయింది. ఇంట్లో కజిన్సున్నారు. నవ్వుతూ పేలుతూ'' కూతుర్ని కని ముద్దుముచ్చటలు చూస్తా'' అన్నదిట. పరాయి పిల్లల్నీ సాకాలా మీరు డియర్? ఆ ముల్లు తొలగించాలి. గౌతముడంతటివాడు పరాయి పిల్లల్ని విసిరేశాడు సాకలేదు''.

నిషా వదిలింది. బెడ్ మీద కూచుని తల పట్టుకున్నాడు సర్జన్. గోడ గడియారం పన్నెండు కొట్టింది. టేబిల్‌లైట్ మంచి వెల్తురివ్వటం లేదు. అంధకారంలో అహం లేచి పురుషుడవు అని హెచ్చరించింది. రక్తం కుతకుతా వుడికింది.

''యెలా?'' అన్నాడయోమంగా.

''గుట్టుచప్పుడుగా పనిచేసేవారు నాకు తెలుసు. డబ్బు మనది కాదనుకుంటే, కిరాయి'' అంటున్నది పద్మిని.

''అటువంటి వారెట్లా పరిచయమైనారు నీకు?'' అనడిగాడు. మత్తు వదిలించుకోవాలనీ, తెలివినబడాలనీ ప్రయత్నిస్తున్నాడు.

''యెటువంటి వారికైనా కుటుంబాలుంటాయి. నాతో పనిబడుతుంది. డబ్బు డబ్బు అని కలవరించను నేను. వారు నా చేతిలో వుంటారు''.

అలా మోసపోయాడు చెట్టంత సర్జన్.

''మీ యిద్దరికీ వయసులో తేడావున్నది. అది చాలక నువ్వామెకు అందటం లేదు. కనిపించుకుని తన యీడు వాడందగానే'' అంటున్నది పద్మిని. సర్జన్ బెడ్ మీద కొరిగాడు. తానా అంటే తందానా అన్నట్లు పద్మినీతో కలిసి చెప్పిన అడ్రస్‌కు కారు తోలుకెళ్తే. వారిద్దరూ సమయానికి అవుటాఫ్‌స్టేషన్. ముంబాయి వెళ్లారుట. మరో అడ్రసుకు వెళ్తే వాళ్లిద్దరూ యి హి హీ అని నవ్వి 'ససేమిరా!'' అన్నారు. పాపభీతీ దైవభక్తీ అని పేలారు దణ్ణాలు పెడుతూ అన్నారు.

''మర్డర్ మా వల్ల గాదమ్మో! పర్‌ఫెక్ట్ మర్డరనేది లేదు. యెక్కడో పప్పులో కాలేస్తాం. తీగలాగితే డొంకంతా కదిలినట్టు అంతా పైకి తేల్తుంది. కాలో చెయ్యో విరిచినా, విరూపిని చేసినా పెద్ద ఆపద రాదు, దొరా!''

వారిలో మరో గడుగ్గాయి ''డబ్బు శాశ్వతమా? కట్టుకుపోతామా?'' అనుకోవాలి దొరా!'' అని సన్నగా నవ్వి నోటికి చేతివేళ్లు అడ్డంపెట్టి

''డబ్బే దైవం, డబ్బే పావనం'' అని నమ్మే యిద్దరు హోర్డుకోర్ల మారుపేర్లు

చెప్పి రహస్యంగా యెలియాస్ అని అసలు పేర్లు చెప్పి దణ్ణం పెట్టాడు. 'పనిచేసి చూపాలంటున్నారు యిద్దరూ గదమ్మా. వాళ్ల చూసేవాళ్లే'' అన్నాడు తలొంచుకుని.

అలా ముల్లు తొలగింపబడింది. కాని ముల్లు అన్న ఆర్మీ రిటైర్డ్ జెట్టీ. మీసం మెలేసి తవ్వించగా, తవ్విన కొద్దీ బీరుపోకుండా కథ నడిచిన పద్ధతి బైటికొచ్చింది. బావే దోషి అని తెలిసి జెట్టీ వెలవెలపోయాడు.

కిరాయి గూండాలే అరెస్టయి కోర్టులో నిలబడి బోనుపట్టుకుని తామిచ్చిన సలహా విన్నారు గాదని విచారం అభినయించారు సాక్షులు. రసీదులు, పేమెంట్ డబ్బు, అది అందజేసిన యెకాంప్లిస్ పేరు బైటపడ్డాయి. మెర్సీ పిటీషన్లు అందుకుని న్యాయాధిపతి పదిహేనేళ్లు ఖైదు చేశారు. ప్రోద్బలం చేసి నామెకి అరవై ఆరేళ్లు''.

పెద్దమ్మ భోజనమైంది. విస్తరి మడిచి చేత్తో పట్టుకుని లేచింది. దొడ్లోకెళ్లి పెరటి తలుపుతీసి విస్తరి పారేయగానే కుక్కపిల్ల వచ్చి మిగిల్చి పారేసిన అన్నం తినసాగింది లోపలి కొచ్చి చేయీ మూతీ, పాదాలూ కడుక్కుని ద్వారం వద్ద నిలబడి అన్నది.

''అంతా వినబడింది బాబులూ. నా చిన్నప్పుడా ప్రాంతాన్ని సరాష్ట్ర అనేవారు. మా అమ్మమ్మదంతా హాస్యమే. సత్యమూ శౌచమూ, దయా అహింసా, మంచి నడవడీ అని శాక్యముని బోధిస్తుంటే, ఆయన సవతి తమ్ముడు మరో రెండాకులెక్కువ చదివి మరోమెట్టు పైకెళ్లి, జీవహింస జరక్కుండా నోటికి అడ్డంగా గుడ్డ కట్టుకోమనీ, గ్లాసుమీద గుడ్డ వేసి మంచినీళ్లు తాగమనీ, వంటి మీద బట్ట అనవసరం సిగ్గు లజ్జా లేని పన్లు చేయకుండా వుంటే చాలు అని బోధించి జినుడని ఖ్యాతికెక్కాడుట. అమ్మమ్మ అనేది అంత భేషజమక్కర్లేదే బుల్లెమ్మా, రాగద్వేషాలు జయిస్తే చాలు. అసూయ క్రూరకర్మలు చేయిస్తుందట బాబులూ. దుర్యోధనుడు దాయాది సోదరులకు మంచి తెలివి జ్ఞానం గల భార్యా వచ్చిందే. వారి ఐకమత్యం చెడకుండా కాపాడుతున్నది. ఆ ద్రౌపదిని లాగేస్తే పాండవులు కకావిక లౌతారని యీర్ష్యపడేవాడట. ధర్మరాజేమో తమ వంతు భూభాగం

లాగేశాడే తమ్ముడు దుర్యోధన! యుద్ధం చేసి అయినా సరే మొత్తం భూమి లాక్కోవాలి అనుకునేవాడట'' అని చెప్తూ లోపలికెళ్లింది పెద్దమ్మ.

దొడ్డి వాకిలి తలుపులు బార్లానెట్టి శ్యామలి పరుగెత్తుకొచ్చి లోపలకెళ్లి పెద్దమ్మను వాటేసుకుని బావురుమన్నది. పెద్దమ్మ చెంబుకింద వదిలి చూలాలు శ్యామలి వీపుమీద రాస్తూ పెరటివాకిలి వేపు చూసింది. శ్యామలి తల్లి శేషుమాంబ చేతిలో కత్తిపీటతో సహా వస్తూ కంటబడింది.

''దాన్ని ఆదుకోకు ఆదెక్క. ఇవాళ అమీతుమీ తేవాలి'' అని వురిమి పళ్లు కొరికింది శేషుమాంబ. ఆమె వెనకాలే కొందరమ్మలక్కలూ. దవడలు నొక్కుకుంటూ, దొంగ నవ్వులు, వెక్కిళ్ళు పెడుతూ వచ్చారు. వారి నోళ్లు నవ్వుతుంటే నొసలు వెక్కిరిస్తూ వుండటం గమనించింది ఆదెమ్మ.

''యేమిటే శేషూ! తిరిగే కాలూ తిట్టే నోరూనీది. తిరగటానికి చేతిలో డబ్బుండటం గాబోలు, సీనువేసి డబ్బు కలెక్టు చేసి దానితో వూరికి వుడాయించాలని కూతుర్ని తప్పు పడుతున్నట్టు నమ్మిస్తున్నావా?'' అన్నది.

''బాగా అంటించావు ఆదెక్క. చేత డబ్బుంచి వెళ్లాలని తెలియదా శ్యామలి మొగుడికి అని మండిపోతున్నది శేషు. యెటోపోయాడుట. ఐపులేడట. ఇవాళే తప్పు పైకి తేలిందేం? శేషుపేరు సార్ధకమైంది. ద్విజిహ్వా. కూతుర్ని దులిపేసింది. కనులెర్రజేసి, పళ్లు పటపటలాడి ''చంపేస్తా. దిక్కులేనిదానా'' అని చంపబోతున్నట్టు నాటకమాడుతున్నది. శేషమ్మ అచ్చు నాగమ్మ నాయకురాలల్లే ఆడించింది నాగరాజుని. వాడిని రానిచ్చింది. కూతుర్ని పోనిచ్చింది. వెళ్లద్దంటే వెళ్లిందనీ నలుగురి నోట్లో నానేట్టు చేసిందనీ గెంటేస్తున్నట్టు జాలం విసిరింది శేషు. అయిందీ? ఆదెక్కా? లేదు. కూతురు చేత గొడ్డు చాకిరీ చేయిస్తున్నది'' కొప్పు యిటూ అటూ అందంగా కదిలిస్తూ మూతివిరుస్తూ అన్నది పున్నమ్మ.

లోపలున్నవారికీ దృశ్యం బాగానే కనబడుతున్నది.

''అల్లుడి దగ్గర గుంజకపోతే నువిస్తావా ఆదెక్కా? నువ్వెవరు నా కూతుర్ని

ఆదుకునేందుకు? నాకూ మూటవుంటే నేనూ దేవిరించను. వాడి మూట గిరగిరా తిప్పి వాడి మొహానే విసిరేస్తా. పూటకూళ్లమ్మనా? వ్యభిచార గృహం నడుపుతున్నానా? అల్లుడినడిగానంతేగా? నేను కాపరాల్లో నీళ్లు పోయలేదు. శాకాహార భోజనశాలల వయసుగాళ్లనీ ఆకర్షించటం లేదు. నా కూతుర్ని వదిలేయ్. ఇవాళ అమీ తుమీ తేలాలి'' అని రంకె వేసింది శేషమ్మ. చూలాలు శ్యామలి ఆదెమ్మ వెనకాల నిలబడి తొంగిచూసి ఆదెమ్మ నడుంచుట్టూ చేతులు బిగించింది.

''డబ్బు రాలేదాకా అలా నోటికి పనిచెప్తుంది శేషుమాంబ'' వేలు ముడేసుకుంటూ అన్నది సీతక్క.

''రాలుద్దును శేషమ్మా. సమయానికి చేతులో లేదు'' అన్నదాదెమ్మ. షా లోపల్నించి నవ్వుతూ వచ్చి శేషుమాంబకెదురుగా నిలబడి, ''మనదే దర్శనం పిన్నమ్మా!'' అని పలకరిస్తూ లాల్చీ జేబులోని వందనోట్లు నాలుగుతీసి శేషుమాంబ పిన్ని కందించి నవ్వుతూ దణ్ణం పెట్టాడు.

శేషు లెక్కించింది ''మరో నాలుగు లేవూ?'' అని నల్లని పీల పెదిమలు కదిలిస్తూ గొణిగింది. కిందపడేసిన కత్తిపీట చూసింది. నోట్లు కొంగున ముడేసుకున్నది.

''వుంటే యిచ్చేద్దును పిన్నీ. లేవు. డబ్బు శాశ్వతమా? మీ దర్శనం చేసుకోవాలి మరి'' అని ఆహ్లాకరంగా నవ్వాడు షా. వ్యంగ్యం గ్రహించే స్థితిలో లేదు శేషుమాంబ. '' ఇప్పటికి చాలు '' అని ''దర్శనమా? నాదా? నన్ను చూసే తెలుసుకోలేవూ? తెలిసేట్టే వేషం వేశానే''. కూతురుకి పురుడు నేనేపోయాలి. అత్తగాని అత్త పోయదు.బెడద తప్పించుకున్నది తప్పుపట్టి. నాకు తప్పదు. కన్న కడుపు గదూ?'' అని బిరబిరా వెళ్లింది. వాకిలి తలుపు చప్పుడయేట్టు మూసింది.

''కత్తిపీట వదిలేసి వెళ్లిందే పిన్నమ్మా. వేషాన్ని బట్టి చూస్తే మరీచ మహాముని దర్శనమనాలి. కత్తిపీట కోసం మళ్లా వస్తుందేమో పెద్దమ్మా. మరీచ మహాముని

ఆదర్శంగా ప్రపంచమంతా సుందరంగా కనబడింది పిన్నమ్మకు. ఉన్మాదం ఆవేశం తగ్గాయి''.

''సరైన మందు వాడి శేషువమాంబ పైత్యం తగ్గించావు బాబూ. ఘనవైద్యుడివేమో'' అని నవ్వి వెళ్లిపోయింది సీతమ్మ.

''శ్యామలీ! భోజనం కాలేదా? నా మనమడూ రాలేదింకా? వేళదాటిందే'' లోపలి కొచ్చారు ముగ్గురూ.

వాకిట్లో యిద్దరు స్టూడెంట్సు నిలబడి కనిపించారు.

''యేమిటి వార్త?'' అనడిగాడు పురుష వచ్చి.

''పెద్దమ్మ మనమడు నాగేష్‌ని అరెస్టు చేశారు రిమాండులో వున్నాడు. దిమ్మెరపోయాడు నాగేష్'' అన్నారు చేతులు కట్టుకు నిలబడ్డారు. బిక్కచచ్చి వున్నారు.

''నేరమేమిటో మీకు తెలియ రాలేదూ?''

''దొంగనోట్ల రవాణాలో పాలున్నదట. అండర్‌గ్రౌండ్ వారితో రహస్య చెలిమి వున్నదట. నకిలీ చిట్‌ఫండ్ నడుపుతున్న ఆసామికి సాయపడుతున్నడట''.

''వారంటు చూపారా రక్షణ శాఖ వారు?''

''చూపారని నాగేషే అన్నాడు మాతో. ఇంటి దగ్గర చెప్పద్దు. అమ్మమ్మ బెంబేలు పడుతుంది'' అన్నాడు. కాని యెంతసేపు దాచగలము? రేపైనా పాక్కిపోతుంది. పేపర్లో పడచ్చు అనుకుని వచ్చి చెప్పేశాము''.

ఆదెమ్మ కొంగుతిప్పి దోపుకుని అడుగుముందుకేసింది. శ్యామలి ఆమె కాళ్లు చుట్టేసింది. ''పెద్దమ్మా నేనూ వస్తా. నన్ను వదిలి వెళ్లకు. నువ్వు లేవని తెలియగానే అమ్మ వచ్చి లాక్కెళ్తుంది. ఆమె నోరు మంచిదిగాదు. విన్నావుగా? పని చేయిస్తుంది. నా నేరమేమిటో! పెద్దమ్మా ఆ పని నీకే చేసిపెడతా'' అని దీనంగా పెద్దమ్మ వంక చూసింది.

ముగ్గురూ చూశాగా చూలాలిని.

''పెద్దమ్మా. మేము వెళ్లి నాగేషుని తెచ్చేస్తాం. నువ్వెళ్లక్కర్లా. మమ్మల్ని నమ్ము. నమ్మి చెడినవారు లేరూ'' అని నవ్వు మొహాలతో వెళ్తూ ''సాయంకాలం సర్వెంట్సూ జీతగాడూ, ఆవూ గేదె వస్తాయి. పని చూసుకోవాలి'' ధైర్యంగా వుండు'' అన్నారు.

''సరే బాబులూ. ఇంట్లోనే వుంటా'' అని ఆదెమ్మ శ్యామలిని లేవదీసింది ''అన్నం పెడతా, రా'' అన్నది.

రాత్రి తొమ్మిదన్నరగంటలకి నాగేషుని వెంటబెట్టుకొచ్చి పెద్దమ్మ కప్పగించారు ముగ్గురూ.

''యెలా వదిలారు బాబులూ బిడ్డనీ? కేసు నమోదైందేమో! అంత తేలిగ్గా వదలరే! బాబులూ మీరు త్రిమూర్తులు'' అని కళ్లు తుడుచుకుని మనమడిని గుండెలకు హత్తుకున్నది పెద్దమ్మ.

''అదంతా యింద్రజాలం పెద్దమ్మా. వాడి కూతుర్ని చేసుకోనన్నాడు నాగేషు. దిట్టంగా నామం దిద్ది, డాబూ దర్పం చూపుతూ డబ్బును గడ్డిపరకగా చూస్తున్నట్టు ఖర్చులు చేతబెట్టి వెళ్లిన లక్ష్మయ్య కసీ కక్షా పెంచుకుని కేసులో యిరికించాడు వీర వైష్ణవుడు. ఆఫీసర్లు కేసు బనాయించినవాళ్లూ, సాక్ష్యాలు పలికిన వాళ్లూ, అంతా ఒక ముఠా. అంతా ఆయన అనుయాయులే. నేర్పుగా నాటకమాడారుగానీ పెద్దమ్మా, వారి మీదకే తిరిగింది చక్రం. సుదర్శన చక్రం దూర్వాసుడి మీదికి తిరిగింది గదూ అలా. లక్ష్మయ్య భవంతిలోనే దొంగనోట్లు దొరికాయి. పేలుడు మందు మత్తుమందు పొట్లాలు. రోజు కూలీకి తిండిలేని చిన్న సన్నాలసులొచ్చి తీసికెళ్తారుట. పంపకంలో తకరారొచ్చి చీలిపోయి బైటపెట్టారు. పట్టుబడ్డారు. వాళ్లమ్మాయి రాములమ్మ సోషల్‌వర్క్ చేస్తూ ఆడ నక్సల్సుని లొంగిపొమ్మనీ రీహబిలిటేషన్ పునరావాస కేంద్రం సెంటర్సులో పని చూపిస్తారనీ, నిలువ నీడ చేసేందుకు పని లభిస్తాయనీ స్త్రీలను మంచి మార్గానికి

తెస్తున్నదట. అందుకే యింట్లో కాలు నిలువదు పిల్లకి. బోయ్‌ఫ్రెండ్సు వున్నారు. వాళ్లే అంతా బైట బెట్టారు. తండ్రి అరెస్టవుతుంటే చూడలేదట. మావోయిస్టుట. యేం మతం అనడిగితే ''రెడ్‌మతం'' అని నవ్వుతుందిట. గట్టిబిడ్డే పాంటూ షర్టూ ఆధునిక తిరుగుబాటది. పై వేషం చాలునని చెప్తున్నాయి. అన్ని దర్శనాలూ ఆచరణలో పట్టింపులున్నా ఫరవానై'' నవ్వాడు షా.

''ఇవాళ కారేజీలే కావాలి'' అని మనుషులొచ్చారు తెలిసినవాళ్లే. ఆదెమ్మ కారేజీలు నింపినవి వారి కందించింది. వెళ్లిపోయరారు. ఇంట్లో వాళ్ల భోజనాలయేప్పటికి రాత్రి పదకొండైంది. శామలి గదిలో కెళ్లి పడుకున్నది.

నిశ్శబ్ద నిశీధిలో శేషమాంబ తలుపు తట్టి లోపలికొచ్చింది. నిలకడగా కూచుని కబుర్లాడింది. కలకలా నవ్వింది. కూతుర్ని వెంటబెట్టుకెళ్లటానికి వచ్చిందని తేలింది.

''నీకు తెలియకనా ఆదెక్క? యే భాగోతం వేయనిదే రోజెలా గడుస్తుందీ? అల్లుడు మాయమౌతాడని కలన్నా రాలేదు. సాయిలాపాయి లాగా వున్నాడు గదా అని సరిపెట్టుకొచ్చా. చిన్నవాళ్ల చదువులు పూర్తిగావద్దూ?'' అని ముక్కు పీక్కుని గూడెగరేసింది.

ఆదెమ్మ లేచివెళ్లి శ్యామలిని తట్టిలేపి ''అమ్మ వచ్చింది తీసికెళ్లానికి'' అంటే. ''రేపెళ్తాలే పెద్దమ్మా నిద్ర పోనీదు. యేదో రొద పెడ్తుంది. వినలేను'' అని అటుతిరిగి పడుకున్నది శ్యామలి.

తెల్లారుజామునే లేచారు ముగ్గురూ. ఆదెమ్మ ''హే రామ హే కృష్ణ'' అని పాడుతూ చల్ల చేస్తున్నది. పని ఆమె వచ్చేసింది. కల్లాపి చల్లుతున్నది.

''సత్రా భోజనం మఠా నిద్రా మాది పెద్దమ్మా. జగమే మాయ. ఉదర నిమిత్తం బహూకృత వేషం అని శేషు పిన్ని ప్రాక్టికల్సు చూపింది. ధన్యవాదాలు మా తరఫున చెప్పు. మళ్లా కలుసుకుందాం. నమస్తే'' అని నడిచిపోయారు మోడరన్ బైరాగులు.

5

భగవంతుని సృష్టి, చైతన్యమూ ఆనందమిస్తున్నా ఆకలీ, బడలికా పాదయాత్ర ఆపమన్నాయి. బాగా నీడనిస్తున్న మర్రిచెట్టుకింద నేలమీద వత్తిగిలి పడుకుని, కునుకు తీసే ప్రయత్నంలో వున్నారు, పురుష, షా, ఆనంద. గడ్డం పెరిగింది. తల మాసింది. గుడ్డలు మాసాయి చెప్పుల్లేవు. ఒళ్లంతా దుమ్ము చెమటా. భోజన సమయం అది.

నలుగురబ్బాయిలొచ్చారు. పాతిక, యిరవై యేళ్ల వాళ్లు ''సాయం చేయగలరా సాములూ! మోసబోయాం. ఆశాభంగమైంది. స్వయంపాకం, దారి బత్తెం యిస్తాము గది కేటాయిస్తాము'' అంటున్నారు.

కళ్లు విప్పి చూచారు. నిలబడి చేతులు కట్టుకుని వున్న యువకులు కంటబడ్డారు. యువకులు దణ్ణాలు పెట్టారు. నవ్వుతూ, స్నేహం వెల్లడించారు.

ఆనంద, ''తప్పక సాయపడతాము భాయియో, పరోపకారార్థమిదం శరీరం. మోసం యెలా జరిగిందీ? యే విషయంలో ఆశాభంగం పొందారు?'' అనడిగాడు.

పెద్దవాని పేరు జోగులు. ''మత సామరస్య, సమరస భావం అహింసా, దయా ప్రాపగేట్ చేయాలనీ, వర్ణభేదం తుడిచి వేయాలనీ వుద్యమం లేవదీశాం సాములూ. చందాలేసుకుని శ్రమదానం చేసి ''బాలాంబ''కు గుడిలేవదీశాం. మేస్త్రీ, కూలీలూ గూడా సానుభూతి చూపి, నాల్గో వంతు కూలీయే యిమ్మన్నారు రోజుకి. భోజనం, కాఫీ ఫలహారాలూ యివ్వగలిగాం పూర్తి అయాక విందుచేసి వస్త్రదానం చేశాము. బాపనోళ్లని తెచ్చి, బాలాంబనీ, శివయ్యనీ ప్రతిష్టించే కార్యక్రమం జరిపాము. సంబరం చేశాము. తిరణాల, పరసా జరుపుకునే యేర్పాటు చేశాము. పాదాభివందనమని పక్షానికోసారి చేయిస్తాము. నైవేద్యం పెట్టించి చిన్నబిడ్డలకి పంచుతాము. లక్ష్మివారం కుంకుమ పూజ చేస్తాడు అర్చకయ్య. మూడుగదుల క్వార్టర్సు శాంక్షను చేశాము. అసలు విషయమేమనగా సాములూ, పండగా, పబ్బం, నేతల పుట్టిననాడూ, దసరా, దీవాలీ, సంక్రాంతి,

గణపతి, నవరాత్రులకి సాముల నాహ్వానించి, అన్నీ యేర్పాటు చేసి, మంచి మాటలు, దేశసమైక్యతా, సమరస భావం లాంటి మంచి విషయాల మీద, స్పీచెస్ దంచాలని చెప్పి బెస్ట్ స్పీచ్‌కి పారితోషికమిచ్చే ఒక స్కీము పెట్టాము. ఈ సారి వస్తామని మాటిచ్చినవారు, రాలేమని ఫోన్ చేశారు. ఈపాటికల్లా కంటబడాలి. కంటబడలేదు. అదీ ఆశాభంగం. మీరు దంచగలరా?'' అన్నాడు గుక్క తిప్పుకోకుండా. పురుష నవ్వుతూ అడిగాడు. ''బాగానే అధ్యయనం చేసినట్టున్నావే సోదరా! నువే దంచరాదూ. బాడుగ మనిషెందుకూ?''

''బాగా అడిగారు సాములు. మేమదే సూచించాము. వీడు ఒప్పుకోటం లేదు'' అన్నాడు రెండో సోదరుడు రాములయ్య. ''యేమంటావు?'' అన్నట్టు జోగులు వంక చూశాడు రాములయ్య.

''నాకు పోజులు పెట్టటము రాదు. సామిలాగా వేషం కట్టినా దంచటం రాదు. ఆడియన్సు నా వంకే చూస్తుంటే దడపుడుతుంది. మీరు ముగ్గురూ బైబర్తి సాములల్లే వున్నారు'' అని మళ్లా దణ్ణం పెట్టాడు జోగులు.

షా నవ్వి లేచాడు. తక్కినిద్దరూ లేచారు.

''ప్రస్తుతం పాదయాత్ర వల్ల నీరసించాము. స్వయంపాకం యిచ్చి వండే స్థితిలో లేము. శుభ్రపడితే గొప్పే. నాలుక పిడచకట్టింది. మీ శక్తిమేరకు వుడకేయచ్చు. తినటానికి బతకం గదా. బతికి వుండటానికి తింటాము. శాకాహార నియమం అదీ యిచ్చింది. రుచీ పచీ గమనించం. ప్రాచీనకాలంలో భిక్షులు భిక్షకెళ్లి దొరికిందే తినే అలవాటు చేసుకుంటే కొంతమంది వేసిన భిక్షలో వుప్పు వాడటం లేదని తేలిందట. అందుకని ఒక కొమ్ములో వుప్పు వేసి జోలెలో పెట్టుకుని వెళ్లి భిక్ష ఆరగించేప్పుడు వుప్పులేని వంటకాల్లో వుప్పు కలుపుకుని తినసాగారుట. అది గమనించారు కొందరు భిక్షులు. ''అలా కొమ్ములో వుప్పు దాచి తీసికెళ్తే అది కోరికే. కోరికలను జయించమన్నాడు తథాగతుడు. వుప్పులేకుండానే తినాలి'' అన్నాడట'' అన్నాడు నడుస్తూ

''అలాగే సాములూ పుడకేస్తాము. స్నానానికి యేరున్నది. పైబట్టన్నా లేదే సాములకి. మేమిస్తాము. రండి'' అన్నాడు జోగులు దారి చూపుతూ.

''ముగ్గురం విడివిడిగా దంచాలా? కలిసే చెప్పచ్చా స్పీచ్? బుర్రకథ లాగానా, జముకుల కథలాగానా? సోదిలాగానా, బోధలాగానా సోదరా జోగయ్యా?'' అనడిగాడు షా.

''సాములు బాగా నవ్విస్తారు. అదంతా మీకే వదిలేశాం ఏస్టైలైనా యిష్టమే. గ్రిప్పింగా, రసవత్తరంగా, ఉత్తేజకరంగా దంచాలి ప్లీజ్. మేము చప్పట్లు కొట్టి నవ్వాలి'' అన్నాడు జోగులు.

ఆ సాయంత్రం ఆరింటికల్లా, వూరివారు, పెద్దలూ మైదానం నింపి కలకలలాడించారు. తోరణాలు, వెలిగించేందుకు గాసులైట్లు నేలమీద తివాసీలు, చాపలు, జంబుఖానాలు పరిచారు.

దగ్గర్లోనే తినుబండారాల బండ్లు, సోడాలు, రకరకాలు ఉడకబెట్టినవీ, వేయించినవీ వేరుశనగ, తోపుడుబండ్లలో పండ్లు, చెత్తపోసేందుకు డబ్బాలు.

మొదట ఆనంద లేచి వేదికమీద నిలబడి తలపాగా చుట్టి నమస్కారం చేశాడు. కనకాంబరం లాల్చీ, దోవతీ, నడుముకి వుత్తరీయం మెడలో రుద్రాక్షల తావళం. చేతులకి స్ఫటికపు పూసల గొలుసూ. చేతులాడిస్తూ, మనిషి కదుల్తూ అందర్నీ చూస్తూ అందర్నీ వుద్దేశించి నమస్కారం చేసి,

''నమస్తే, సోదరసోదరీమణులారా! సహోదర, సహోదరీగళే, భాయియో బహనో! నాకివాళ ఆనందంగా వుండి గర్వపడే అవకాశం లభించింది. నా మీద గౌరవం లేనిదీ మీరంతా శ్రమకోర్చి వచ్చి సభ కలకలలాడేట్టు చేస్తారా వింటున్నారా, లేదా, కబుర్లేసుకున్నారా అనేది గమనించగూడదు (అనగానే సభలో కరతాళ ధ్వనులు మోగాయి - నవ్వులు వినిపించాయి) ధన్యుడిని మీ కాహ్లాదం కలిగించగలిగాను. చికాగో నగరంలో మతసంబంధ సభలో పాల్గొంటున్నట్టున్నది. నిష్పక్షపాతంగా, ఫిలాసాఫికల్‌గా, హాస్యం గూడా కలిపి

చెప్పుకుంటే మంచిదంటాను. ప్రజాకవి గానం చేశారు. ''వైకింగులూ, శ్వేత హూణులూ, చెంఘిజ్ ఖాన్ యెవడైతేనేం ఒక్కొక్కడూ మహా హంతకుడు. వారికి మతమనేది లేదా అంటే వున్నది. మతమేమి చెప్పలేదా అంటే చెప్పిందనే అనాలి. మతం కన్న ఆకలిగొప్పది. అదెలా చెపితే అలా వింటాం. రెండవది ఆశ. '' ఆశాపాశముతా కడుకొనిడుపు సత్యమ్మ'' అన్నాడు కవి. మనమంతా ఆశతోనే జీవిస్తాము. భూస్థలి అంతా వెతికి చూచినా, రక్తం చిందని చోటు లేదు, హింసలేని ప్రాంతం లేదని గూడా కవిగానం చేశాడు. అతి ప్రాచీనకాలంలో యూదులు గూడా క్రూరులే. రష్యా మీదకి దాడి చేసేవారు. చరిత్ర చెప్తున్నది. ఆహారం సంపదా లేకనే దాడులు చేసేవారని అదీ చలికాలంలో చలికీ ఆకలికీ లొంగి జరిగేవనీ చరిత్ర చెప్పింది. అదే సున్నితంగా ఓమర్ ఖయ్యామ్ అనే కవీ గాయకుడూ మతగురువూ గీతికలల్లి రోమాన్సు కలిపి గానం చేశాడు. హింస, దారుణాలు, దురాగతాలు, అత్యాశ మానసిక వేదన కలిగించగా, సత్యము గుర్తించి వేదనను అణిచి సారాయము రోమాన్సూ యిచ్చిన ఆనందం మరేదీ యివ్వలేదని గీతికలు అల్లి పాడేవాడు. కడుపునిండా నూరుగిన్నెల సారాయం పోస్తే తప్పులేదు. ఆడపిల్ల ఆహ్వానిస్తే, దాని మోహం తీర్చటానికి వెళ్తే నేరం గాదు'' అని గానం చేస్తే ఆ గానం ప్రజలలోకి పాకింది. కాని ఫ్రీ ప్రేమా దయా, అహింసా, సత్యము, శౌచము, అవి వేదికనెక్కి వాగితే యెవరూ వినలేదు. ఆయన అల్లిన రచనలు ప్రజలూ పాడసాగారు. ఆయన పేరు మారుమోగింది.

కొంతమంది అసూయాగ్రస్తులు, ఆ మారుమోగుతున్న పేరును అణిచివేయలనీ, ఆ గీతాలు వినబడకుండా చేయాలనీ, దర్బారులో చక్రవర్తి వద్ద ఫిర్యాదు చేసి నేరం మోపారు ఖయ్యామ్ మీద.

''జహా పనాహ్! మత గురువై యువతరాన్నీ ప్రజలనూ తప్పుదోవపట్టిస్తున్నాడు ఖయ్యామ్! వ్యభిచారాన్నీ తాగుడునీ ప్రోత్సహిస్తున్నాడు ఓమర్''.

పర్షియా చక్రవర్తి చిన్నతనమంతా మృత్యువును తప్పించుకుంటూ

గడిచింది. వెంట్రుకవాసిలో హత్యనుండి బతికి బయటపడ్డాడు. గద్దె యెక్కాలనే కుట్రలూ ఆకలి బాధా చవిచూచాడు. నిలువ నీడలేక నిద్రలేక ఒంటరితనమూ అనుభవించాడు. దశదిశలా శత్రువులే. దయ, అహింసా నమ్మి పెద్దవాడై గద్దె యెక్కాడు. గురువు ఓమర్‌ఖయ్యామంటే చాలా గౌరవమూ భక్తీ, ప్రేమా. ఆయన గానానికి అసలర్థం చక్రవర్తికి తెలుసు. కని దర్బార్‌లో నేరం ఋజువైంది. తీర్పులో తీర్పరులు దేశ బహిష్కారం నిర్ణయించారు. తప్పదు. ముద్ర వేశాడు. కాని వీడ్కోలివ్వటానికి రహస్యంగా ఒంటరిగా వెళ్లాడు సరిహద్దులకి గాఢాలింగనం చేసుకుని తన వేదన వ్యక్తం చేశాడు.

''గురూ! యెండలు తీవ్రమైనాయి. పెద్దవారైనారు. తట్టుకోలేరేమో. నన్ను క్షమించండి. ఆ గానం, గీతికలు ఆపేస్తే బాగుండేది''.

''నాయనా పర్షియా చక్రవర్తి యెంత అందగాడో అంత దయార్ద్ర హృదయుడు. అంతగానూ దైవానికి వెరుస్తాడు. నాయనా! విచారణ మతప్రాతిపదిక మీద జరిగింది. శిక్ష వేయటం నీ వంతు అయింది. కాని జహాపనాహ్! మత వ్యాప్తి చేయటానికి వెళ్తున్నామని చెప్పి యుద్ధమూ మతవ్యాప్తికేనని నమ్మించి, స్త్రీలను బంగారాన్నీ కొల్లగొట్టుకొచ్చి, నిరపరాధులను, నిస్సహాయులను హత్యచేశామనే చింతలేక మతగురువులకు భాగం పెట్టమని మతం చెప్తున్నదా? ఈ వ్యాపారం యెప్పటినించో వున్నది. సముద్రపు దొంగలు భూమి చేరగానే మతగురువులకి నజరానాలిచ్చేవారు. అదే మతమని గురువుల అభిప్రాయమేమో అనాడు గూడా. నాయనా తాగుడూ, వ్యభిచారం ప్రోత్సహిస్తున్నానని నేరం మోపారు. కాని జహాపనాహ్! స్నానశాలల్లో, పానశాలల్లో జరిగే అవినీతి విచారణకొచ్చిందా? రివాజు, ఆచారము, కట్టుబాటు అని చెప్తూ గదిముందు స్త్రీల చెప్పులుంచి లోపలకి పోరాదనీ స్త్రీలున్నారని గుర్తు చూపుతూ లోపలికి దూరి నేర్పుగా వచ్చేయటం మతాచారమా? అంత వంచన చేసి దైవాన్ని మెప్పించగలమా? అంతకన్న సారాయం సేవించి ఒళ్లు దెలియక నేలమీద పడి దొర్లితే నలుగురూ నవ్వుతారంతే. స్త్రీలను బానిసలుగా అమ్మితే నేరం గాదా?

పిలిస్తే వెళ్తే నేరవూ? జహాపనాహ్, నాకు పడిన శిక్షకు వ్యధ జెందకు. దండయాత్రలూ యుద్ధాలూ ఆపు. హింస ఆపు. దయను పెంపొందించు. అదే నాపై గౌరవాన్ని వెల్లడించే పద్ధతి. సెలవు యియ్యి నాయనా'' అని కన్నీటితో వీడ్కోలందుకున్నాడు ఓమర్ ఖయ్యామ్.

''కాని గురూ! నేను సమాధానం చెప్పాలి. తప్పదు. పర్షియా మీద హఠాత్తుగా దాడి చేసి దోచుకెళ్లిన వారికి నేను సమాధానం చెప్పాలి. అది నా కర్తవ్యం'' అని వెళ్లిపోయాడు చక్రవర్తి. షా లేచి నవ్వు మొహంతో అందుకున్నాడు స్పీచ్.

''బ్రదర్స్ అండ్ సిస్టర్స్! యితర అంశాలలాగే చరిత్రగూడా ఇంటరెస్టింగా వుంటుంది. కాలాశోకుడు కళింగ యుద్ధం పూర్తి చేసి శాంతాశోకుడైనాడు. రక్తం ప్రవహించాక స్వాతంత్ర్యం కోల్పోవటం యిష్టం లేక వేలాదిమంది ప్రాణాలొడ్డి నేలకొరిగాక, కుటిల నీతి రాక, యుద్ధ విద్య రాక, సాహసం ప్రాణాలు పణంబెట్టారు కళింగులు. ప్రాణాలు తీశాకే అశోకుడు బౌద్ధం స్వీకరించి, బౌద్ధ మత వ్యాప్తి చేయటానికి, సంఘాలూ ఆరామాలు, భిక్షులు అని తయారుచేసి బుద్ధుని అహింసా సిద్ధాంతం ప్రేమా దయా ప్రాపగేట్ చేయ కంకణం కట్టుకున్నాడు. అంతకు ముందే ఆ కంకణం కట్టుకోవచ్చునే. ఆ కంకణానికి విలువ చెల్లించింది కళింగులే. భిక్షులు చేపాటి కర్రొకటి పట్టుకుని, వూ వల్లేనే పాదయాత్రలు చేస్తూ, అహింసా, కోరికలను జయించుట, సోదరభావము, సత్ప్రవర్తన, మొదలైనవి ప్రాపగేట్ చేస్తూ జోర్డాన్ వరకు వెళ్లి చూసొచ్చారుట తూర్పున సరేసరి. మంచూరియా, మంగోలియా, చైనా, జపాన్, ఇంకా ఇండోనేషియా, అలా చాలా ప్రాంతాలు చూసి ఆనందించి వచ్చారుట. వీరు పడిన కష్టాలకు మంచి ఫలితమే వచ్చింది. శాక్యముని లైటాఫ్ యేషియా అనే బిరుదు పొందాడు. కాని చైనీస్ టిబెటన్లని వూచకోత కోశారు. అదీ బౌద్ధంలోని భాగమేమో. తథాగతుడు వెర్రిమొహం వేసివుండాలి. హోయసలులూ అంతే బ్రదర్స్. యుద్ధం చేశాకే చెవిచేతినుండి

దీక్షావస్త్రాలందుకున్నాడు రాజు (సభలో నవ్వులూ, చప్పట్లూ, యీలలూ, హుర్రే హుర్రే, భళాభళి, పురే పురే అని కేకలు) ప్రచారకులకీ వుద్యోగం తెలిపే యూనిఫామ్ యిస్తారు. తెల్లని పొడుగాటి కోటూ మెళ్లో గొలుసూ దానికి శిలువ, మీకు తెలియందేమో పెరిగిపోతున్న హింసనూ అవినీతినీ దారుణాల్నీ అరికట్టుతున్నాడు అని అర్థం. మొదట్లో తాళం చెవీ యిచ్చుకునేవారు. అంటే కీ టూ హెవెన్ అందిస్తున్నారు ఒకరికొకరు. మరోటి ప్లస్ ఆకారం వున్నది. అంటే నెగెటివిజమ్ పెంచుకోకు. ఉన్నాడు రక్షిస్తాడు. దయ అహింసా నేర్పు అని సింబల్. అలా శ్రమిస్తూ పాదయాత్రలు చేస్తూ బోధిస్తున్నా మరోవేపు యుద్ధాలు జరుగుతూనే వున్నాయి. పాపంపూర్ తథాగతా గూడా యుద్ధాలాపలేకపోయానే అనే విచారంతోనే పోయాడట. గ్రేట్ బ్రిటన్ నించి రష్యా చివరివరకు యుద్ధాలు. సెవెనియర్సు వార్. హండ్రెడియర్స్ వార్. బోధలే నదుల్లో కొట్టుకుపోయాయో! ప్రచారం గాల్లో కలిసిపోయిందేమో. ఆస్తికోసం, హక్కు కోసం, మతం వేరు, అధికారం నిలుపుకోవాలని తాపత్రయమే యుద్ధాలకీ హింసకీ కారణం. తేలిందేమనగా, హింస అహింస, వర్ణభేదం మతము అనేవి పడుగు పేకాలాగా, పుట్టుకా చావులాగా కలిమిలేములలాగా విడివడనివి. చెప్పేదేమనగా నేర్చుకోవల్సిందేమనగా సాటిమనిషిని గౌరవంగా చూడటం నేర్చుకుంటే, అలవాటు చేసుకుంటే సమరసభావం రక్తంలో చేరుతుంది. ఆ అలవాటు రక్తసంబంధీకులకీ వస్తుంది. వర్ణభేదమూ పోతుంది''. పురుష లేచాడు. ''అది కంఠశోషే. ఆత్మవత్ సర్వ భూతాని యఃపశ్యతి అని సనాతనం యేనాడో వక్కాణించింది. పామరత్వం వదుల్చుకుంటే తక్కిన పిచ్చి ఆలోచన అవే పోతాయని ఆదిశంకరులెప్పుడో చెప్పారు'' అంటున్నాడు.

''పామరత్వం యెలా వుంటుందీ వివరిస్తారా సామీ?'' అని పామరుడడిగాడు నిలబడి.

''చెప్తా సోదరా కూచో. సోదాహరణ పూర్వకంగా చెప్తా. ఒక శైవుడు ఒక వైష్ణవుడు మా మతం గొప్పది మా దేవుడు గొప్పవాడు. భక్తవత్సలుడు, అంటుంటే

వైష్ణవుడు అడ్డొచ్చి మా దేవుడు భక్తపరాధీనుడు, సిరికి చెప్పకుండా చేలాంచలమైనా వీడకుండా పరుగెత్తుకొస్తాడు రక్షించటానికి యెన్నిసార్లో వచ్చాడట్లా మా మతము గొప్పది అన్నాడు. వైష్ణవులది నిలువుబొట్టు, శైవులది అడ్డబొట్టు. తాము భోజనానికొచ్చిన యింటి అడ్డ దూలాలు శైవుడు చూపితే నిలువు దూలాలు వైష్ణవుడు చూపాడు. ఆధిక్యత మరిచి వుద్రేకపడి ఒడలు మరచి ఉన్మాదించినట్టు చూస్కో అంటే చూస్కో అని ఒకళ్ల దేవుణ్ణి ఒకళ్లు కిందికి లాగి నేలమీదపడేశారు. ఇల్లు నేలమట్టమైంది. ఇదంతా చూసినవారు వారి వీపులమీద బాజాలు వాయించి, వంగదీసి నడ్డిమీద మృదంగ ధ్వనులు పుట్టించారు. ఇద్దరు మతస్థులకీ పామరత్త్వం వదిలి జ్ఞానం కలిగింది. లెంపలేసుకుని పరిహారం చెరిసగం చెల్లించి చెంపలు వాయించుకుని వెళ్లిపోయారు. తనదైవమనీ పరదైవమనీ తారతమ్యమెంచి పెనువాద తర్కములు చేసి ఘనమైన పాపమును బొందీ అని వాగ్గేయకారకుడు కీర్తన అల్లాడు. అలాగే దైవాలలాగే అన్ని మతాలు ఒకటే. మతానికీ మతానికీ వైరం లేదు. వైరమల్లా మనుషులకే. కౌరవ పాండవులు, శైవులు వైష్టవులు. ఈర్ష్యాసూయల వల్లె వైరమల్లా యుద్ధంలోకి వెళ్లి పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం నేలకొరిగింది. మిగిలిన వారికి భూమి సరిపోయింది. భూమి పోరాటం పామరత్త్వమే. మృత్యువుతో ముగుస్తుంది. పల్నాటి యుద్ధమూ అంతే నాగమ్మ శైవం. బ్రహ్మనాయుడు వైష్ణవం. వర్ణబేధం లేదని అన్ని వర్ణాల బిడ్డలను పెంచి, పంక్తి భోజనం తినిపించాడు. లోగుట్టు పెరుమాళ్లకెరుక అన్నట్టు, నాగమ్మకు అధికారం కావాలి. రాజ్యకాంక్షపెంచుకో అని శైవం చెప్పలేదే. బోధలతోనూ, ప్రాపగేట్ చేస్తేనూ పరిష్కారమైందా వర్ణభేదం, మత భేదం. లేదు. హింసతోనే యుద్ధంతోనే రక్తం ఒలికిస్తేనేపరిష్కారమైంది. చెప్పేవి శ్రీరంగనీతులూ అని మనకో మోటు సామెతున్నది.

''తెలుసు. తెలుసు సాములూ విన్నాం'' అని నవ్వారు శ్రోతలు.

'' ఆశ లొంగదీస్తే అవినీతీ, వ్యభిచారం, వర్ణబేధం అనేవి గాలిలో కెగిరిపోతాయి. తప్పు పట్టరాదు. సంతోషించాలి ఆ విధంగానైనా అవి గాలిలో

కెగిరాయి అని. కార్లైల్ మహానుభావుడు రచించిన రచనల్లో, మొదట మతగురువులకు ఫామిలీ నిషేధింపబడింది. కాలం పరుగెత్తి మాయా వాగురలో రహస్యంగా స్త్రీ వున్నదని పాక్కింది. వెంటనే మతం దయ గలదై పెళ్లీ పెళ్లాం పిల్లలూ వుండచ్చు గురువుకీ అని సాంప్రదాయం సడలించింది. గురువుల ప్రాణాలు కుదుటబడ్డాయి. చైతన్యము సృష్టికి సహజం. వుద్యమం లేవదీసి దానిని నడపటమూ చైతన్యవంతులు గావటమే. వర్ణభేదం తుడిచేయాలని పెక్కేండ్లనించీ హేమాహేమీలు ఆయాసపడుతూనే వస్తున్నారు. కొంత వుదృతం తగ్గిందేమోగాని చాపకింద నీరులాగా చల్లగా పాకుతూనే వస్తున్నది గదా. హేమాహేమీలకి కొంత పేరొచ్చింది అంతే. మీ వుద్యమం వృద్ధి బొందాలనీ ప్రగతి సంపాదించాలనీ చీలికలూ, డిసిడెంట్లూ అనే వ్యాధులంటగూడదనీ ఆశీర్వదిస్తున్నాను. చీలికలు అంటు వ్యాధి వంటివి. అంటుకుంటాయవి వ్యాధులు. మతవేమిటీ, రాజకీయాలేమిటీ, గృహకీయాలేమిటీ, వుద్యమాలేమిటీ అంతా దర్శనాద్వైతం లాగే వుంటుంది. సర్వం ఖల్విదం బ్రహ్మ అన్నదందుకే''.

ఒక శ్రోత లేచి చేతులు కట్టుకు నిలబడి, ''కొంచెం విశదంగా చెప్పండి. ఇక్కడందరికీ సంస్కృతం రాదు'' అన్నాడు.

''కూచో సోదరా! దీపాలు వెలగటమూ మనం గమనించలేదు. చిల్లర బేరమూ సాగిపోయి, వ్యాపారస్థులు సంతోషించారు. చెప్పటం సులభమే. వినటమే కష్టం. బోర్ కొడుతుంది. విన్నదే విన్నట్లుంటుంది. మనది సనాతనం అందాము. వైదికం, శైవం, వైష్ణవం, ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం, స్మార్తం, వీర శైవం, వీర వైష్ణవం, వైదికం అలా చీలి చీలి పేలికలై అగ్రకులాలూ, కింది కులాలూ మళ్లా వాటిలో చీలికలూ, అలాగే బౌద్ధంలో హీనాయాన మహాయాన, మాంత్రిక్ తాంత్రిక్ అలాగే జైనం తీర్థంకరులు మధ్యలో కాపీకాట్‌లాగా అనుకరణలూ, అనుసరణలు. అలాగే యిస్లామ్‌లో షియాలు, సున్నీలు, సూఫీలు, వగైరా. క్రిస్టియానిటీలో కాథలిక్, రోమన్ కాథలిక్, ప్రొటెస్టెంట్, ప్రెస్బిటేరియన్, పెంటకోస్త్. అలాగే శాక్తేయంలో కాపాలికం గాణాపత్యం ఎట్సెటిరా సిఖ్ మతంలో

నిరంకారీ.

ఔరంగజేబ్ ఇస్లామ్ వ్యాప్తి చేయటానికే అన్ననూ అన్న కొడుకునూ చంపించి గద్దె యెక్కి ఖురాన్‌కి ప్రతులు రాసి అమ్మి టోపీలు కుట్టి అమ్మి ఆ డబ్బుతో జీవించాడట. నిరాడంబరుడుట. స్వయంకృషి మతం లో చెప్పాయిట. చివరికి తొంభైయ్యో పడిలో తప్తహృదయంతో, యెందుకంటే తండ్రి షాజహాన్ని కంసుడు తన తండ్రి ఉగ్రసేనుని జైల్లో పెట్టినట్టు, షాజహాన్ భవనమే ఖైదులాగా చేసి కాపలాపెట్టాడుట. ఆయన్ని యెవరూ కలుసుకోకుండా బందోబస్తు చేశాడుట. ఆలగీర్, వసియత్‌నామా వ్రాశాడుట, అందులో నా శవం శవపేటికలో పెట్టి నప్పుడు, మొహం మీద వస్త్రం తొలగించి పశ్చిమం వేపు తిప్పద్దు. నన్ను అల్లా మెచ్చడు''.

మతం చెపితేనే కోట్లాది ప్రజాధనం పెట్టి, అమ్ముడుపోని, వాడుకలేని ఆయుధాలు కొని, తిలాపాపం తలా పిడికెడు అని పంచుకున్నారు. మతంలో గట్టి నమ్మకమున్నవారే, దాని ప్రచారానికై చాలా వెచ్చించినవారే, పంజాబు వధల మీద జానపద గేయాలల్లి గానం చేసే అవకాశం కల్గించారు. వారి మతస్థురాలిని చంపారని, ఆమె చనిపోయి మర్డర్ అయినచోట నడుంవంచుతూ పాకుతూ పొమ్మనటమేగాక, పరమత చూలాళ్లను పొట్టమీద పాకమన్నారు. అదే మతం పేర్కొన్నది? అలా చేయించమనే జలియన్‌వాలా బాగ్‌లో అన్ని రౌండ్లెందుకూ అని వింతపడి అడిగితే కాల్పులు జరిపినవాడు, యీ చెంపకొడితే ఆ చెంపచూపమని నేర్చినవాడు ''యింక తూటాలు లేవు అందుకని యిరవై ఆరు రౌండ్లతో ఆగిపోయినై. కాల్పులు ఉండి వుంటే మరో నాల్గురౌండ్లు కాల్పించేవాడినే. తప్పేమున్నదీ సార్ ! సభలు చేయరాదని శాసిస్తే, యెందుకు చేశారు? దోవసన్నమే అనుకోండి, శాసనాన్ని ధిక్కరించినట్లేగా'' అని నిర్భీతిగా జవాబిచ్చాడట. శాసనోల్లంఘనం శాంతియుతంగానూ చేయరాదనే మతం బోధించింది. నిరాయుధుల మీద అగ్నివర్షం కురిపించమన్నది మతం. అదే దర్శనాద్వైతం. ఒక మతానికీ మరో మతానికీ పోట్లాట లేదు''.

సభికులంతా చప్పట్లు కొట్టి మెచ్చామని వెల్లడించారు.

ఒక చిత్ర నిర్మాత బ్లాక్‌హాక్ కల్కటా తీద్దామా వినోదం కోసమే. అంటే, హిమాంశురాయ్ అనే నిర్మాత క్లైవు దురంతాలింకా వినోదమివ్వటమే గాక ఎక్సైటింగా వుంటాయి. రెండూ తీద్దాము'' అన్నాడట.

''భలే బావుంది జవాబు'' అన్నారు యువకులు.

''నా చిన్నతనంలో సహవిద్య నేర్చానం. ఆ బడిలో చదివే యిద్దరమ్మాయిలు '' మీ దేవుడు కొయ్య, మీ దేవుడు రాయి, మీ దేవుడు మెటల్'' అంటూ వాదులాట మాని శిఖలు పట్టుకుని పీక్కుని రక్కుకుని చివరికి గుడ్డలు చింపుకున్నారు. రక్కులకి రక్తం వుబికింది. స్కూలు ఛంట్రోతులు వారిని విడదీసి లాక్కెల్లి హెడ్‌మాస్టర్ ముందు నిలబెట్టారు. అది ఆటవిడుపు టైము.

''సార్! కొట్టుకుంటున్నారు బడి ఆవరణలో. చెప్తే వినటం లేదు సార్'' అని కంప్లెయింట్ చేశారు.

''యే విషయంలో వాదులాట దెబ్బలాటగా మారిందీ? సాక్షులు లేరూ? తప్పెవరిదో తేల్చి శిక్షవేయాలిగా'' అన్నారు మేష్టారు.

పనివారు నన్ను వడేసిపట్టి తీసికెల్లి నిలబెట్టి, '' యీ అబ్బాయి సాక్షి. చూస్తూ నిలబడే వున్నాడక్కడే'' అన్నారు.

''తప్పెవరిదీ? యేమంటావూ?'' అనడిగాడు మేష్టరు.

''యెవరితప్పూ లేదు సార్. ఆ అమ్మాయి లిద్దరూ వారివారి మతాలు చెప్పినట్లు, చేయమన్నట్లు చేశారు. అంత నమ్మకమున్న దన్నమాట మతంలో. ఆ అమ్మాయి మతం, దీని జుట్టు పీకి తెంపి రక్కి గుడ్డలు చింపమన్నది. ఈ అమ్మాయి మతం యింకో మెట్టు పైకి పోయి దాని రక్తం కళ్ల చూడమన్నది. దాని గౌను చీలికలుగా మార్చమన్నది. ప్రాక్టికల్సు ద్వారా తమ మతం మీది గౌరవం వెల్లడించారంతే సార్'' అన్నాను.

హెడ్ మాస్టరేం చేసేవారో గానీ, ఆ అమ్మాయిలిద్దరూ గభిక్కున యేడుస్తూ వచ్చి మేస్టరుగారి కాళ్లమీద పడి క్షమాపణ చెప్పుకుని, లెంపలేసుకుని నిలబడి

''యింకెప్పుడూ కొట్టుకోము సార్. ప్రమాణం చేస్తున్నాము. స్నేహంగా వుంటాము'' అని బుజాల మీద చేతులేసుకుని వెళ్లిపోయారు.

తరువాతి మెట్టు ఉన్నత పాఠశాల. దానిలో అంతా అబ్బాయిలే. అక్కడ సహవిద్య లేదు. అయినా సరసాలు విరసాలయేవి.

ముక్తార్ అనే అబ్బాయి సొగసు చూపుతూ, '' ఆవు పేడా మీరు హల్కి కుంటార్! ఆవు వుచ్చా మీరూ తాగికుంటార్! కుక్కా కోతీ యెక్వా మన్షీ తక్వా హెబ్బెబ్బె హెబ్బెబ్బె హేమీ మతం ఛీ ఛీ మతం థూ థూ తుక్కు మతం కోతి సామీ మీకు ఛీ ఛీ ఛీ కుక్క సామీ మీకు తూ థూ థూ'' అని పాడుతూ అన్నాడు ఆటస్థలంలో. బడి వదిలారు.

మరో అబ్బాయి శిలార్ ''రాముడే మీ దేముడైతే దుఃఖించునా?'' అని గెంతాడు.

శామ్యూల్ అనే అబ్బాయి తెలుగు పద్యాలు వల్లె వేయటంలో దిట్ట. ప్రైజు గూడా కొట్టాడు. ''కనక మృగము యిలను కలదు లేదనుచునూ, తరుణి విడిచి చనియె దాశరథియూ! తెలివిలేనివాడు దేవుడెట్లాయెరా?'' అని చదివాడు.

తలవూపుతూ వింటున్న రామశర్మ అందుకుని జవాబుగా నసాళానికంటేట్టు పాడుతూ ఆడుతూ వుడికిస్తూ 'పేరులోనే సత్తెముంటే ముడ్డిలో కట్టెందుకూ?'' అని పకాపకా నవ్వి, ''మరియమ్మకు మొగుడు కావలెనా పుత్రునకు తండ్రి కావలెనా చెల్లి పెళ్లామైతే తల్లి యేమగును? దనుజ వివాహమనగా నేమిరా తమ్ముడా పైచి యనగా నేమిరా తమ్ముడా?'' అని అన్న అడిగినట్లు మరో గొంతుతో పాడి వెంటనే గొంతు మార్చి ''తండ్రి తెచ్చుకున్న స్త్రీని, తాతెచ్చి ఆడితే దనుజ వివాహమగును అన్నారో'' అనిపాడుతూ ఆడుతుండగా అందరూ కలియబడి దొమ్మిలాగా చేస్తుంటే పిస్టల్ షాట్ వినబడి

ఆపేశారు. నిలబడి బిక్కమొహాలతో చూస్తే పెట్రోల్ కార్లోంచి ఆరడుగుల యస్పీ దిగుతూ కంటబడ్డాడు. గప్ చిప్. ఒకళ్లనొకళ్లు మిర్రి మిర్రి చూశారు. ''న్యూసెన్సు కేసు బనాయిస్తున్నా'' అన్నాడు యస్పీ. అందరిలోకీ పెద్దవాడు అపాలజీ రాసిచ్చి ''సారీ సర్. రికార్డులో కెక్కితే చెరిపేసుకోలేము. మా హెడ్ మాస్టరుగారు ఫైన్ వేయచ్చు లేదా సస్పెండ్ చేయచ్చు, లేదా పరీక్ష రాయ నివ్వను అనచ్చు. వుయ్ ప్రామిస్. సమరస భావం అలవరచుకుని స్నేహంగా వుంటాం'' అని అందరి చేతా దణ్ణాలు పెట్టించాడు. యస్పీ నవ్వి కారెక్కాడు.

మైసూరు సింహం హైదరల్లీ, రూపయా కనిబెట్టి సైనికులకి నెలజీతాలు వెండి నాణేలలో యిచ్చే పద్ధతి పెట్టినవాడు, గుర్రమెక్కి వెళ్తూ, నడిబజారులో గలాటా, కొట్లాటా చూసి,

''దేనికి కొట్టుకుంటున్నారు?'' అనడిగాడు

''యెవరి మతం గొప్పదో బలబలాల ద్వారా తేల్చుకుంటున్నారు హుజూర్'' అని సలామ్ చేసి చెప్పాడు ప్రేక్షకుడు.

సన్న చేసి కొరడా అందుకుని గుర్రం మీదే వుండి, కొట్టుకునే వారి చుట్టూ తిరుగుతూ బాది బాది త్రాహి త్రాహి అనేట్లు చేశాడు హైదరల్లీ. ''మత సంబంధమైన కొట్లాట కంటబడితే ఆకొట్టుకునే వారిని అరెస్ట్ చేసి తేవాలి. వారికి ఉరిశిక్ష వేసి మైదానంలో వురి తీయిస్తా. మతకలహాలు అణిగిపోతాయి'' అని అధికారమిచ్చాడు వుద్యోగులకు.

ఇంకా పెద్ద వింత యేమనగా ఆనాడు వైద్యులంతా ముస్లిములే. ఇద్దరు హిందువులు ముస్లిమ్‌లలాగా తయారై అసిస్టెంట్సుగా చేరి వైద్యం నేర్చారు. చాలా చివరికి వారు యేమతస్థులో బైటబడింది. నేరం మోపి లాక్కెళ్లి, దర్బారులో హైదరల్లీ యెదుట నిలబెట్టారు.

''వంచించారు హుజూర్'' అని నేరం వివరించారు.

''వంచనేదీ యిందులో? వైద్య విద్య అందరికీ వస్తుందా? అందరూ

తగిన వైద్యం చేయగలరా? మనకు తగినంతమంది వైద్యులేరీ? సైన్యానికి ప్రత్యేకించేందుకు వైద్యులేరీ?'' అన్నాడు గాని వైద్య విద్య నేర్చినవారినీ అడిగాడు.

''యేమని జవాబిస్తారు? వంచనేనని ఒప్పుకుంటారా?''

''హుజూర్! వివరంగా విని న్యాయం దయ చేయించాలి. ''మీరు హిందువులు. విగ్రహారాధన చేస్తారు. అలా చేయగూడదు. పాపం. పాపం చేసేవారికి వైద్యం నేర్పరాదు. అల్లా మెచ్చడు. అసిస్టెంట్సుగా గూడా తీసుకోరు. మీరు మమ్మల్ని మ్లేచ్ఛులు అనటమే గాక ద్వేషిస్తారు గూడాను. మీ మతం మీ కెంత గొప్పదో మా మతం మాకూ అంతే'' అన్నారు. హుజూర్! మీ అమ్మాయిలు మా అబ్బాయిలను మెచ్చి పెళ్లాడదలిస్తే మీ మతాన్ననుసరించి మా అబ్బాయిలే మారుతారు. మీ అమ్మాయిలు మారరు. సంతానము కలిగితే వారూ మీ మతమే. విగ్రహారాధన తప్పు అని ఒప్పుకుందామంటే, మేం మతం మారి గుండు కొట్టించుకుంటే తల్లిదండ్రులు పోయినట్టు గుర్తు. వదిలేట్టు లేరని దారి కాచి కొట్టించారు. దానికి మతం హర్షించు అది నేరం కాదన్నదేమో. కష గట్టటం నేరం కాదన్నదేమో. వైద్యం నేర్పద్దంటున్నదేమో. దయా దాక్షిణ్యం మరిచిపొమ్మంటున్నదేమో'' అని సలాములు చేస్తూ, నేలమీదికి వంగి తలలు వంచి ముఖాలు కనబడనీయలేదు.

హైదరల్లీ నవ్వు నణిచి, ''భేదభావం లేకుండా, బీదసాదా రాజు పేదా అనేవి పాటించక, పాత విషయాలు తవ్వి తలకెక్కక వైరం మరిచి సోదరభావం నెరపుతూ వైద్యమందిస్తారా?'' అనడిగాడు.

''తప్పకుండా మీ ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటాము. వైద్య మందిస్తాము, హుజూర్. దర్బారులో ప్రమాణం చేస్తున్నాము మాట తప్పము. అసలు విషయానికొస్తే హుజూర్, అన్ని మతాల వారికీ భేదభావం లేకుండా వైద్యమందటం లేదని గమనించే, వేరు మార్గం లేక యిలా నేర్చాము. న్యాయం దయ చేయించండి హుజూర్. అల్లా మీకు వివేకమిచ్చాడు'' అంటూ అందాకా అంగరఖాలో దాచి వుంచిన విలువైన వాటిని నజరానాగా హైదరల్లీ యెదుట

వుంచి సలామ్ చేశారు.

తమ హాకీముల వంక చూసి, హైదరల్లీ వైద్యం చేయచ్చని అనుమతి పత్రం యిప్పించి ముద్రవేసి యిచ్చాడు ఆ ఇద్దరికీ.

మతం చెప్పనిదే, మనుషుల మీద మతప్రభావంలేనిదే మతం అనుసరించేవారు, యేనాటివో బౌద్ధ శిల్పాలను, విగ్రహారాధన తప్పు పాపము అని, మందుగుండు కూరి పేల్చి పప్పు పప్పు చేస్తారా? అవి విగ్రహాలు కావు శిల్పాలని మతం చెప్పదా? ధూపదీప నైవేద్యాలేవీ? గుడియేదీ? గుహ అంతే. అవి ఏక శిలలు.

గోల్డెన్ టెంపుల్లోకి సైన్యంతో ఆయుధాలతో వచ్చినవారిని చంపమనేది మత బోధే. నేవీలో ట్రెయినింగ్ అవుతున్న టీనేజర్స్, గాఢంగా నమ్మినవారై, అనుమతి లేకుండా, మతిలేని వారిలాగా డ్యూటీ వదిలి పరుగెత్తారు. వారిపై అధికారి వ్యధా వేదనా వెల్లడించాడు. మతం చెప్పేవన్నీ చేస్తున్నారా. తెలిసీ తెలియని వయసు. తీసేస్తారని మరిచారు. ఉద్రేకానికీ ఉన్మాదానికీ లోనైనారు అని బాధపడ్డాడు.

మనకు హాస్యపూరిత సామెతలున్నాయి. ఆర్నెల్లు సాము చేసి మూలనున్న ముసలమ్మను చంపాడుట ''అన్ని సార్లెందుకు పేల్చటం. ఒక గుండు చాలే?'' అని ఆశ్చర్యం వెల్లడిస్తూ ప్రశ్నిస్తే ''అది సిగ్నల్. పనిపూర్తి చేశాము అని గుర్తు'' అని జవాబిచ్చాడు పనిచేసి చూపినవాడు'' అని ముగించాడు పురుష.

అందరూ లేచారు. కొందరొచ్చి ముగ్గురి ఆటోగ్రాఫ్‌లూ తీసుకున్నారు. ఫ్లాష్‌బల్బ్స్ వెలిగాయి.

''సభ విజయవంతం చేశారు సాములూ. అదీ యిచ్చిన టైములోనే యెవరూ సభ వదిలి వెళ్లలేదు'' అలా చెప్పి ముగ్గురికీ అని చెప్తూ, ఆహ్వానించిన జోగులూ మూడువేల మూడువందల నలభై యెనిమిది రొఖ్ఖం అందించాడు.

''ధనార్జన చేయము. దాన్ని ఆశించి దంచటానికి ఒప్పుకోలేదు సోదరా.

ధనాన్ని షన్ చేస్తాము. అంటే తృణప్రాయం గడ్డిపోచ కింద లెక్క'' అని నవ్వుతున్నాడు పురుష.

''మీ ఆశయం తెలుసుకోవాలి అని వున్నది సాములూ''

''యెవరి నెత్తినన్నా యెక్కి మేస్తూ వుండాలని. అదే మంటే స్త్రీలు ఒంటరిగా వుంటే వంచనా, మానభంగాలు జరుగుతాయి. వాటిని జరక్కుండా చేయాలనేదే మా అభిలాష'' అన్నాడు షా.

''బలే హ్యూమరస్ వేలో మాట్లాడుతారు సార్. మీ అభిలాషా ఆశయం తీరాలని మేము విష్ చేస్తున్నాము. దర్శనాద్వైతం వాడుక భాషలో పామరుల కర్థమయేట్టు విశదీకరించారు. మీరు తిరస్కరించిన డబ్బుతో వుపన్యాస సంకలనం చేసి పుస్తక రూపేణ తెప్పిస్తాము. వెల పదికి మించదు సాములూ. బై బై. మళ్లా కలుసుకుందాం'' అంటూ వెళ్లిపోయారు యువకులు. మైదానం నిర్జనమైంది.